Whatsapp No: 9440662699
www.rajadhanivartalu.com
facebook.com/rajadhaniv
RNI No. APTEL 2015/ 66622


# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 2 సంచిక 46, పేజీలు 8 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 7- ఆదివారం 13, ఆగస్టు-2017

## 7న సీఎం చంద్రబాబు పోలవరం రాక



**ప.గో/ ఏలూరు:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 7న పోలవరం రానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి 2 నెలలకోసారి పోలవరం నిర్మాణ పనులను సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెలలో పోలవరం రావాల్సి ఉన్నప్పటికి వాయిదా పడింది. వచ్చే సోమవారం సీఎం విజయవాడ నుంచి బయలుదేరి పురుషోత్తంపట్నం ఎత్తిపోతల పథకం నిర్మాణ స్థలికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలవరంలో పనులను పర్యవేక్షిస్తారు. అక్కడి నుంచి నేరుగా పోలవరం చేరుకుంటారు. సాయంత్రం 5 గంటల వరకు ప్రాజెక్టు నిర్మాణ స్థల పరిశీలన, కాంట్రాక్టు ఏజెన్సీలు, ఇంజనీర్లతో సమీక్ష అనంతరం విజయవాడ బయలుదేరి వెళ్తారు. ఇప్పటికే పోలవరం పనులు శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో మరికొన్ని సూచనలను ఇంజనీర్లకు సీఎం ఇచ్చే అవకాశం ఉంది.

## ఆగస్టులో సెలవులే సెలవులు..




**హైదరాబాద్ :** ఆగస్టు నెలలో ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు వరుస సెలవులు రానున్నాయి. ఆగస్టు 12న రెండో శనివారం, 13 ఆదివారం, 14 కృష్ణాష్టమి, 15న స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు వరుసగా నాలుగు రోజులు పని చేయవు. అయితే ఆగస్టు 14న కృష్ణాష్టమికి బ్యాంకులకు సెలవు లేదు.అదే విధంగా ఆగస్టు 25న వినాయకచవితి, 26న నాలుగో శనివారం, 27న ఆదివారం కావడంతో బ్యాంకులు వరుసగా మూడురోజులు పనిచేయవు. శ్రావణమాసం శుభ కార్యాలకు తోడు వరుస సెలవులు తోడవ్వడంతో బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు దొరక్క ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే సందడిలో సడేమియాలా ప్రైవేట్ ట్రావెల్స్ అమాంతం టిక్కెట్ ధరలు పెంచేశాయి.





## పచ్చనిపొలాల్లో పరుచుకున్న

# పిచ్చిమొక్కలు

### దుర్భర దారిద్ర్యంలో రైతుకూలీలు

**రా.వా ప్రతినిధి, అమరావతి :** రాజధాని ప్రాంతమట్టే ఉంది. దగ్గరికి వచ్చి చూస్తే మాత్రమే తెలుస్తుంది. స్థానికులు వయ్యారిభామగా పిలుచుకునే అత్యంత ప్రమాదకర కలుపుమొక్క అని. రాజధాని నిర్మాణంకోసం ఇక్కడి భూములు తీసుకోక ముందు పంటపొలాల్లో ఈ మొక్క కనపడగానే రైతులు తల్లడిల్లిపోయేవారు. ఎందుకంటే అది పంటదిగుబడిని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ మొక్కను తాకితే మనిష్యులకైనా పశువులైనా దుష్ప్రభావానికి గురికావాల్సిందే..

దీన్ని అమెరికా అమ్మాయి, కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్రగడ్డి, ముక్కపుల్లాకు గడ్డి, ఛతక్ చాందిని, అపాది, గజర్ వంటి పేర్లతో కూడా పిలుస్తారు. అత్యంత సులభంగా వ్యాపించే ఈ మొక్క అతి త్వరగా ఏపుగా పెరిగి పంట పొలాలను నిర్వీర్యం చేస్తుంది. వయ్యారిభామను తొలుత అమెరికాలోని ఉష్ణ ప్రాంతంలో గుర్తించారు. మన దేశానికి దిగుమతి అయిన ఆహార ధాన్యాలతోపాటు 1956లో మన దేశం చేరింది. ఆ తర్వాత మొదటి సారిగా 1973లో ఈ మొక్కను మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో కనుగొన్నారు. వయ్యారిభామ పంట పైరుల ఎదుగుదలను నియంత్రిస్తుంది. దీంతో దిగుబడి తగ్గుతుంది. పత్తి, మొక్కజొన్న, గోధుమ, మల్బరి తోటలు, పూల తోటలు, మామిడి,కూరగాయల తోటల్లో ఎక్కువగా పెరుగుతాయి. పంటలకు వేసిన ఎరువుల సారాన్ని కూడా పీల్చి వేస్తుంది. నత్రజని, పోషక విలువలు, సూక్ష్మధాతువుల శాతాన్ని తగ్గిస్తుంది. ఈ మొక్క స్రవించే కొన్ని రకాల రసాయనాల వల్ల పంటల పెరుగుదల నశించిపోతుంది. దీని పుష్పాల నుంచి

- మిగతా 2 లో



## వెంకయ్యనాయుడు విజయం

ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ శనివారం ప్రశాంతంగా జరిగింది. పార్లమెంటులోని లోక్ సభ, రాజ్యసభ సభ్యులు ఈ పోలింగ్‌లో పాల్గొన్నారు. ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి వెంకయ్యనాయుడు, యూపీఏ అభ్యర్థిగా పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ గోపాల కృష్ణగాంధీ పోటీలో ఉన్నారు. 233 ఎన్నికైన, 12 మంది నామినేట్ చేయబడిన వివిధ పార్టీల (మొత్తం 245 మంది) రాజ్యసభ సభ్యులతో పాటు 543 మంది ఎన్నికైన లోక్ సభ సభ్యులు, మరో ఇద్దరు నామినేటెడ్ లోక్ సభ సభ్యులు (మొత్తం 545 మంది) ఈ ఓటింగ్ లో పాలుపంచుకోనున్నారు. మొత్తం 790 మంది ఎంపీలలో మెజారిటీ సభ్యుల మద్దతు ఎన్డీయేకు ఉండడంతో వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా గెలుపు సునాయాసమైంది.






రాజధాని వార్తలు
కలం

# 13ఏళ్ల ఉద్దాన పరిశోధనలు


ఉద్దాన కిడ్నీ వ్యాధిగ్రస్తులపై 13 ఏళ్ల నుంచి పరిశోధనలు జరుగుతున్నాయి. కాని వ్యాధి కారకాలను మాత్రం ఇతిమిద్దంగా ఇప్పటివరకు కనుక్కోలేకపోయారు. వైఎస్ హయాంలో ఈ ప్రాంతంలో మొదట పరీక్షలు చేపట్టింది విశాఖపట్నం కేజీహెచ్ ఆసుపత్రి. 2004లో తాగునీరు, రక్త నమూనాలను లేబొరేటరీకి పంపి ఆహారపు అలవాట్లపై అధ్యయనం చేశాయి. 2007లో శాన్‌ఫ్రాన్సిస్కోలో అంతర్జాతీయ వైద్య సమావేశం జరిగితే వైఎస్‌ప్రభుత్వం తరుపున కేజీహెచ్ నెఫ్రాలజీ విభాగపు అధిపతి డాక్టర్.రవిరాజును అక్కడికి పంపారు. మొదటిసారి వారు ఈ సమస్యను అంతర్జాతీయంగా నివేదించారు. 2008లో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సు,సీసీఎంబీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైద్రాబాద్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ న్యూఢిల్లీ, నిమ్స్ హైదరాబాద్ ఉమ్మడి అధ్యయనం జరిపారు. అయితే కారణాలను నిర్ధారించలేకపోయారు. 2008లో హార్వర్డు, కేజీహెచ్ అధ్యయనాలు జరిపాయి. ఆ సమయంలోనే రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను ఏర్పాటు చేశారు.ప్రస్తుతం బాధితులంతా అక్కడే ఆరోగ్యశ్రీలో వైద్యం అందించి డయాలిసిస్ చేయించేవారు. 2011లో స్వచ్ఛంద సంస్థ వ్యాధి తీవ్రత ఉన్న 15 గ్రామాల్లో పర్యటించి బాధితులకు వైద్యసౌకర్యం అందటం లేదని తెలిపింది. హార్వర్డు 2012లో నివేదిక ఇచ్చినప్పటికి వ్యాధి కారణాలు నిర్ధారించకుండా తాగునీరు ఈ సమస్యకు కారణం కావచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ, మరింత విశ్లేషణ అవసరమని చెప్పింది. 2013లో ప్రపంచ ఆరోగ్య సంస్థ,ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ఉద్దానం ప్రాంతంలో 28 శాతం కిడ్నీవ్యాధులకు గురయ్యారని తేల్చింది. 2014లో హైడ్రలాజికల్ ఇండియా ఆఫ్ ఇండియా, రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో అధ్యయనం జరిగింది. 2015లో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ జరిపిన అధ్యయనంలో ఎండిన ఉప్పుచేపలు తినడం,తాగునీటి సమస్య పై అధ్యయనం చేయాలని తెలియచేసింది. ప్రస్తుతం హార్డర్వ్ విశ్వవిద్యాలయం కూడా అవే కారణాలను పేర్కొంటూ, తాగునీటిలో సిలికాన్ ఉండటం, మంచి నీరు తక్కువ తాగడం ద్వారా ఈ వ్యాధికి గురవుతున్నారని తెలిపింది. ఈ బృందంలో కూడా కేజీహెచ్‌కు చెందిన డాక్టర్ రవిరాజా ఉండటంతో ఇది పాత తిత్తిలో కొత్త ద్రవం నింపడమే కాని ప్రస్తుత ప్రభుత్వం , పవన్ కల్యాణ్ కొత్తగా చేసింది ఏమీలేదు. మరింత మెరుగైన చర్యలు చేపట్టి ఉద్దానం కిడ్నీ బాధితులకు ఆరోగ్యం చేకూర్చినప్పుడే వారు అభినందనీయులవుతారు.



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
కన్సల్టింగ్ ఎడిటర్, హైకోర్టు న్యాయవాది
98495 68901/83309 68901
katuruRavindraTrivikram
@gmail.com

పౌరులు-చట్టాలు

# ఉచితసేవల 'బేగార్' నిబంధనలు



**23 బేగార్ నిషేధం :** ఒక వ్యక్తి ఇష్టానికి వ్యతిరేకంగా, ఉచితంగా సేవలు పొందడాన్ని బేగార్ అంటారు. జీతాల చెల్లింపు పద్ధతి లేక పోయినా, ఇష్టానికి వ్యతిరేకంగా సేవలు పొందడానికి వీలులేదు.

**మినహాయింపు :** ప్రతి నిబంధనకు ఉన్నట్లే దీనికీ మినహాయింపు ఉంది. ప్రభుత్వం ప్రజాసేవనిమిత్తం నిర్బంధసేవలకు ఆదేశించవచ్చు. అయితే, ఇలాంటి ఆదేశాలలో కులమత,జాతి, వివక్షలు చూపకూడదు. 'ప్రజాసేవ' కి విస్తృతార్థం ఉంది. కానీ, రాజ్యాంగంలో చెప్పబడిన ప్రభుత్వాలకు సూచనాత్మక విధానాలు (Directive Priniciples of state policy) ప్రజా సంక్షేమ నిమిత్తం పాటించాలి.

**ఫాక్టరీలలో బాలలను కార్మికులుగా వినియోగించటం నిషేధం :-**(Prohibition of Employment of Children in factories) (అధికరణం24) : మనది పేదల సంఖ్య అధికంగా ఉన్నదేశం. ఇల్లు గడవాలంటే ఇంట్లో అందరూ పనులకు వెళ్లాల్సిందే. మైనర్లు కార్మికులుగా ఫాక్టరీలలో వగైరా ఉత్పత్తి కర్మాగారాలలో పని చెయ్యకూడదు. రాజ్యాంగం ప్రకారం14 సంాలోపు పిల్లలెవర్నీ ఫాక్టరీలలో కార్మికులుగా నియమించకూడదు. ఈ నిషేధం తిరుగులేనిది దీనికి ఎట్టి పరిస్థితు ల్లోనూ మినహాయింపు ఉండదు 39వ అధికరణాన్ని అనుసరిస్తూ చేయబడిన యీ నిషేధప్రధాన ఉద్దేశం చిన్న పిల్లల ఆరోగ్యహాని కలుగరాదనే కానీ ఈ నిషేధం అమలు ఖచ్చితంగా జరగాలంటే అందుకు పార్లమెంటు చట్టం చేయాల్సిన అవసరం ఉంది. చట్టంలో దోషులకు శిక్షలు ఉండాలి. బాలలకు రక్షణగా 1938లో చేయబడిన బాలల ఉద్యోగ చట్టం(The Employment of Children act )1948 ఫ్యాక్టరీల చట్టం 1952 గనుల చట్టం,1961లో అప్రెంటీస్ చట్టం ముఖ్యంగా చెప్పదగినవి.

**మతస్వేచ్ఛ హక్కు చట్టం( 25 నుండి38) అధికరణాలు :** మన దేశంలో ప్రభుత్వానికి ఎలాంటి మతమూ లేదు కొన్ని దేశాలలో ఇస్లామ్ ప్రభుత్వాలు ఉన్నాయి. మనది లౌకిక ప్రభుత్వం అన్నిమతాల పట్ల పక్షపాతం లేని సమభావన కలిగి ఉండటమే లౌకికత్వం ప్రభుత్వం మతాలకు అతీతం ఏ ఒక్కమతాన్ని రక్షించదు. ఏ మతాన్నీ విచక్షణా పూర్వకంగా చూడదు.

25 నుండి 38 వరకు గల అధికరణలు లౌకిక ప్రభుత్వ లక్షణాలను స్పష్టీకరిస్తాయి. ఆ విధంగా భారత దేశం సంపూర్ణత గలిగిన లౌకిక దేశం మన రాజ్యాంగం ' మతం' అనేది ఒక విశ్వాసానికి సంబంధించింది. అదివ్యక్తులకు ఒక సమాజానికి చెందింది. అది ఒక దైవవిశ్వాసానికి సంబంధించినది కారక్కరలేదు. మన దేశంలో బౌద్ధము జైనమతము వంటివి భగవంతుని విశ్వసించవు ఒక మతానికి నిస్సందేహంగా కొన్ని ప్రాథమిక సూత్రాలు ఉంటాయి అవి మతాన్ని నమ్మేవారికి తమ ఆధ్యాత్మిక పరిపుష్టికి అవసరమనిపిస్తాయి. ఆమతంలోని బోధనలు, ఆచారాలు వారు పాటిస్తుంటారు. కొన్ని క్రతువులు, కార్యక్రమాలూ చెప్పవచ్చు. వీటిని ఆ మతంలో ఒక భాగంగానూ భావించవచ్చు. ఈ ఆచార సంప్రదాయాలు ఆహారం, దుస్తులకూ వర్తింపజేయవచ్చు. ఈ లక్షణాలను మనం మత వైవిధ్యాలలో చూడవచ్చు.

(సశేషం)

# రూ.100 కోట్లకు చేరుకున్న డిజిటల్ లావాదేవీలు

**న్యూఢిల్లీ :** పెద్ద నోట్ల రద్దు తర్వాత డిజిటల్ లావాదేవీల అవసరం బాగా పెరిగిపోయింది. అందుకు తగ్గట్లుగానే వివిధ రకాల పద్ధతుల ద్వారా డబ్బు చెల్లించుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది.

ఇందులో భాగంగానే జూలై నెలలో చేసిన డిజిటల్ లావాదేవీల సంఖ్య వంద కోట్ల మార్కు దాటిందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. చెక్ క్లియరింగ్, ఏటీఎం క్లియరింగ్, ఐఎంపీఎస్, యూపీఐ, భీమ్, రూపే, పీఓఎస్, ఈ-కామర్స్, ఆధార్ ఆధారిత చెల్లింపులు వంటి అన్ని రకాల డబ్బు చెల్లింపు మాధ్యమాల ద్వారా చేసిన డిజిటల్ లావాదేవీలు కలిపి 100 కోట్ల మార్కు చేరుకున్నట్లు ఎన్‌పీసీఐ ఎండీ ఏపీ హోటా తెలియజేశారు. అలాగే ఇంకో మూడేళ్లలో ఒక రోజులోనే 100 కోట్ల లావాదేవీలు జరిగే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్‌పీసీఐ ఆధారంగా 12 రకాల చెల్లింపు మాధ్యమాలను అందుబాటులో ఉంచినట్లు, మొబైల్ చెల్లింపులు, ఆధార్ ఆధారిత చెల్లింపులను ఎక్కువ మంది వినియోగిస్తున్నారని హోటా వివరించారు. మరోవైపు డిజిటల్ పేమెంట్స్ కమిటీ ఛైర్మన్ రతన్ వాటల్ మాట్లాడుతూ - 2016-17 సంవత్సరంలో డిజిటల్ చెల్లింపులు 55 శాతం పెరిగాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇవి మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

# పచ్చనిపొలాల్లో పరుచుకున్న పిచ్చిమొక్కలు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే పుప్పడి రేణువులు టమోటా, వంకాయ, మిరప మొక్కలపై పడి పుష్పాలు, పిందెలు రాలిపోతాయి. అదే విధంగా కొన్ని రకాల వైరస్ తెగుళ్లు వ్యాపిస్తాయి. తెగుళ్లను కలుగజేసే వైరస్ వయ్యారిభామ కలుపు మొక్కల పుప్పొడిలో ఉండే తామర పురుగులు గాలి ద్వారా వ్యాప్తి చెందుతాయి. పక్వానికి వచ్చిన వయ్యారి భామ విత్తనాలు అతి చిన్నవిగా వుంటాయి. ఇవి గాలి ద్వారా సుమారు 3 కిలోమీటర్ల దూరం వరకు విస్తరించి అక్కడ మొలకెత్తుతాయి.

**మనుషులకు ప్రమాదం**

వయ్యారిభామ వల్ల మనుషులకు ప్రమాదకరమైన చర్మవ్యాధులు, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తాయి. ఈ మొక్క ఆకులు చర్మానికి రాసుకుంటే తామర వస్తుంది. పుప్పొడిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడడం, కను రెప్పలు వాపు వస్తాయి. పొలాల్లో పని చేసిన రైతులు, కూలీలకు చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. దురదలు, తుమ్ములు వచ్చి చర్మంపై మచ్చలు ఏర్పడుతాయి.

**పశువుల ప్రాణాలకు ముప్పు**

వయ్యారి భామ స్పర్శ వల్ల జంతువులకు వెంట్రుకలు వాడిపోవడంతోపాటు రక్తపోటు పెరుగుతుంది. సాధారణంగా ఈ మొక్కను పశువులు తినవు. పొరబాటున గడ్డితో పాటు



వయ్యారభామను తిన్న పశువుల పాలు తాగితే జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది. ఈ రకం మొక్కలు పార్థీనియం, హైస్టరీస్, హైమెనిన్, ఎంబ్రోసిన్ అనే ప్రాణాంతకమైన రసాయనాలను విడుదల చేస్తాయి. ముఖ్యంగా వీటిని తిన్న పశువులు జీర్ణక్రియ, మూత్రపిండాలు, కాలేయం అన్నవాహిక శ్వాసక్రియలు దెబ్బతింటాయి. చివరికి మృత్యువాత పడతాయి.

**నివారణ పద్ధతులు**

పంట పొలాల్లో మొలిచిన వయ్యారిభామ పూత పూయకముందే వేర్లతో సహా పీకి బురదలో తొక్కెయ్యాలి. తర్వాత నీరు పెడితే అది బాగా మురిగి పచ్చరొట్టె ఎరువుగా మారుతుంది. లేదా ఇది పూత దశకు రాకముందే వేళ్లతో సహా పీకి తగల బెట్టాలి. కాలుతున్నప్పుడు వచ్చే పొగకు దూరంగా ఉండాలి. తంగేడు చెట్లు ఉన్న ప్రాంతంలో ఈ మొక్క మొలవదు. వయ్యారిభామను నివారించే శక్తి తంగేడు మొక్కకు మాత్రమే ఉంటుంది. పొలాల గట్లు, బంజరు భూముల్లో తంగేడు చెట్లను తొలగించకూడదు. ఈ కలుపు మొక్క పూత దశకు రాకమునుపే 10 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పు కలిపి ద్రావణాన్ని పిచికారి చేయాలి. అలా చేస్తే వయ్యారిభామ కలుపు మొక్కలు మొలవవు.

**రాజధాని వ్యవసాయకూలీలు విలవిల**

ఏడాదికి మూడు పంటలతో పైరుపచ్చగా అలరారే ఈ ప్రాంతం అంతా పిచ్చిమొక్కలు పెరిగి, స్థానిక రైతుకూలీలకు పనులు కరువై రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లోని రైతుకూలీలంతా విలవిలలాడుతున్నారు.భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఆయా భూముల్లో వ్యవసాయమూ నిలిచి పోయింది. ఫలితంగా ఈ ప్రాంతంలోని వ్యవసాయ కార్మికుల ఉపాధి కోల్పోయారు. ముఖ్యంగా దీని ప్రభావం దళిత కుటుంబాల మీద, దళిత వ్యవసాయ మహిళ కార్మికుల మీద ఎక్కువ కష్టాన్ని మోపింది. పొలం పనులు సాగే రోజుల్లో మహిళా వ్యవసాయ కార్మికులు నెలకు రూ.5,000ల నుంచి రూ.6,000 ల వరకు కళ్లజూసే ఆదాయం ఒక్క మారుగా దూరమైంది. పొలం పనులు తప్ప మరే ఇతర పనులూ చేతరాని మహిళ వ్యవసాయ కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి కరవైంది. కుటుంబ పోషణ భారం మొత్తం పురష కార్మికుల మీదనే పడింది. ప్రత్యామ్నాయంగా ఇసుక రేవుల్లో లారీలు, ట్రాక్టర్లలో ఇసుక నింపే కూలీ పనులకు వెళుతున్నారు. ఇసుక రేవుల్లో చేసే కూలీ పనులకుగాను రోజుకు రూ.200ల నుంచి రూ.300ల ఆదాయంతో మొత్తం కుటుంబాన్ని సాకడం ఆయా వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు పెనుభారంగా మారింది. భూమిలేని వ్యవసాయ కార్మిక కుటుంబాలకు నెలకు రూ.2,500 ల వంతున ప్రభుత్వం అందించే పింఛను ఏ మూలకూ చాలడంలేదని ఆవేదన చెందుతున్నారు. కూడూ, గుడ్డకూ చాలడం లేదని ఇక రోగమో రోష్టో వస్తే వారి కష్టం ఎవరితోనూ చెప్పుకోలేని దయనీయంగా ఉందంటున్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్న వ్యవసాయ కూలీ కుటుంబాలు తుళ్లూరు, లింగాయపాలెం,బోరుపాలెం, రాయపూడి, మోదు లింగాయపాలెం, తాళ్లాయపలెం, మందడం, వెంకటపాలెం, తదితర గ్రామాల్లో ఎక్కువగా ఉంది. ప్రభుత్వమిచ్చే పింఛనుతో తమ కనీసావసరాలనూ తీర్చుకోవడం దుర్లభంగా మారిందని అనేక మంది వ్యవసాయకార్మికులు వాపో తున్నారు. భూములను ఆ విధంగా వదిలేయకుండా పంటలకు అనుమతిస్తే బాగుంటుందని భావిస్తున్నారు.

# ఆనంద్ గ్రూపుకు ఆక్వావర్సిటీ

- 150 ఎకరాల పంట భూములకు ఎసరు
- ప్రైవేట్ సంస్థకు 51 శాతం వాటా
- 49 శాతంతో సరిపెట్టుకుంటున్న ప్రభుత్వం
- వెదజిల్లే కాలుష్యంపై మెదలైన చర్చలు

**రా.వా.ప్రతినిధి – అమరావతి :** గోదావరి ఆక్వాపుడ్ పార్క్ నిర్మాణంపై ప్రజలు, ప్రజాసంఘాలు నుంచి అగ్రవాజ్వాలలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ మరో వివాదాన్ని రాజేసింది. ఆక్వాపుడ్ పార్క్ యాజమాన్యమైన ఆనంద్ గ్రూపు సంస్థలతో కలిసి భీమవరం సమీపంలోని నిర్మాణం తుందుర్రులో 55 ఎకరాల్లో పుడ్ పార్క్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవుంతుండగా ఉభయ గోదావరి జిల్లాల్లో మరో 150 ఎకరాలను అక్వా యూనివర్సిటీ పేరుతో ఆనంద్ గ్రూపు సంస్థలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ఈ నెల 3వ తేదీ అమరావతిలో నిర్వహించనున్న కేబినేట్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించనున్నట్టు తెలిసింది. కేబినేట్ తీర్మానాల్లో ఈ విషయాన్నే అంశంగా చేర్చినట్టు తెలిసింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, తూర్పుగోదావరి జిల్లాలోని కాట్రేనికోన మండలాల్లో విశ్వవిద్యాలయం ఏర్పాటుకు 150 ఎకరాలను ఇప్పటికే సేకరించినట్టు తెలిసింది. భీమవరం మండలంలో 25 ఎకరాలతో పాటు కాట్రేనికోన మండంలోని బ్రహ్మ సమీపంలో 125 ఎకరాలు.. మొత్తం 150 ఎకరాలను పుడ్ పార్క్ యాజమాన్యానికి విశ్వవిద్యాలయం కోసం అప్పగించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఆక్వా యూనివర్సిటీని నెలకొల్పుతున్నారు. అయితే, దీనిలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 49 శాతం కాగా, ప్రైవేట్ సంస్థ వాటా 51 శాతంగా ఉన్నట్టు తెలిసింది. అగ్రభాగాన్ని ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో తన ప్రమేయాన్ని కనిష్ట స్థాయికి తగ్గించుకుంటుందనీ, ప్రైవేట్ సంస్థల పెత్తనానికి పెద్ద పీట వేసి తన బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కుదుర్చుకుంటున్న ఒప్పందమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రైవేట్ సంస్థకే అగ్రభాగం**

ఆక్వా యూనివర్సిటీలో 49 శాతం వాటాకు పరిమితమై అగ్రభాగాన్ని ప్రైవేట్ సంస్థకు కట్టబెడుతున్న నేపథ్యంలో ఈ విశ్వవిద్యాలయం వల్ల సమీప మత్స్య కార కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఒనగూరే ప్రయోజనాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులను కూడా అనుమతిస్తామని చెబుతున్న ప్రభుత్వం సంప్రదాయిక ఆక్వా విద్యను సంపన్ను వర్గాల చదువుగా మార్చేసే అవకాశం లేకపోదని ప్రజలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ యూనివర్సిటీల్లో ఏర్పాటుచేసే కోర్సు,వాటి బోధలపై ఆస్ట్రేలియా, థాయిలాడ్, వియత్నాం, చైన్నా వంటి దేశాలతో భాగస్వామ్య ఒప్పందాలు చేసుకుంటున్న నేపథ్యంలో పేదవర్గాలకు ఈ విద్యను ఏ మేరకు చేరువ చేస్తారనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

**గోప్యత ఎందుకు..? కాలుష్యం మాటేమిటి....?**

కేవలం ఆక్వాపుడ్ పార్క్ నుంచే కాదు విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తే అక్కడ ఏర్పాటయ్యే లేబరేటరీలు పరిశోధనల కోసం సహసిద్ధంగా ఏర్పాటుచేసే రొయ్యల కయ్యలు తదితర అనేక వందలాది అంశాలతో ముడిపడి ఉన్న యూనివర్సిటీ కారకలాపాల వల్ల కూడా కాలుష్య కోరలు చచే అవకాశం ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

యూనివర్సిటీని రెండు పంటలు పండే పొలాల్లో చేయాల్సిన అవసరం లేదనీ ఖరీదైన భూములను కొల్లగొట్టే కుట్రలకు రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు చేయూతనిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి అందువల్లనే ఆక్వాపుడ్ పార్క్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో యూనివర్సిటీ స్థల ఎంపికలో అత్యంత గోప్యత పాటించినట్టు అధికార పార్టీకి చెందిన వారే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటు ఎలాంటి వివాదాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

అమ్మకానికి సిద్ధంగా

# 'రాజీవ్ స్వగృహ'

- 10న వెబ్‌సైట్ ప్రారంభం
- రూ.10 వేలు చెల్లిస్తే ఫ్లాట్ రిజర్వు

**హైదరాబాద్:** రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల అమ్మకానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ఈ నెల 10వ తేదీన సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను ఆన్‌లైన్‌లో ఓపెన్ బుకింగ్ ద్వారా విక్రయించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన విషయం విదితమే. తొలిదశలో భాగంగా బండ్లగూడ 2,245, పోచారంలో 1,474 ఫ్లాట్లను విక్రయించనున్నారు. బండ్లగూడలోని ఫ్లాట్లలో నిర్మాణం పూర్తైన వాటికి చదరపుటడుగుకు రూ. 1,900 చొప్పున, సెమీ ఫినిష్ట్ ఫ్లాట్లను రూ. 1,700 చొప్పున, 'రాజీవ్ స్వగృహ' పోచారంలోని ఫ్లాట్లను చదరపుటడుగుకు రూ. 1,700, సెమీ ఫినిష్డ్ ఫ్లాట్లను రూ. 1,500 చొప్పున విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇక 10వ తేదీనుంచి ఫ్లాట్ల బుకింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఫ్లాట్లను బుక్ చేసుకునే ఉద్యోగులు ముందుగా రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఆ ఫ్లాట్ సంబంధిత ఉద్యోగి పేరుమీద రిజర్వ్ అవుతుంది. తర్వాత ఆ ఫ్లాటు విలువలో 25 శాతాన్ని 15 రోజుల్లోగా, 50 శాతాన్ని నెల రోజుల్లోగా, మిగిలిన 25 శాతాన్ని రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇక వాహన పార్కింగ్ స్థలం కోసం అదనంగా చెల్లించాలి. ఏ స్థాయి ఉద్యోగి అయినా కూడా ఫ్లాట్లను కొనుగోలు చేయొచ్చు. '010' పద్దు ద్వారా వేతనాలు పొందుతున్న ఉద్యోగులకు మాత్రం రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను కొనుగోలు చేసేందుకు అవకాశం లేదు.

కాగా వార్షికాదాయం రూ. 6 లక్షల లోపు ఉన్న ఉద్యోగులు.. 600 చదరపుటడుగుల ఫ్లాట్లను కొనుగోలు చేయాలనుకుంటే.. వారికి వడ్డీ లేని రుణం అందుతుంది. ఈ వడ్డీని కేంద్రం భరిస్తుంది. రుణం కింద... ఉద్యోగికి అతని 60 నెలల మూల వేతనానికి సరిపోను మొత్తాన్ని బ్యాంకులు అందిస్తాయి. రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బును టీఎసఆర్ఎసీ అప్పులను ప్రభుత్వం తీర్చనుంది.

# జీవీ ఎంసీకి రూ.600 కోట్లు ప్రపంచ బ్యాంకు అప్పు

- కారు పార్కింగ్ ఫీజు
- బీచ్‌కు వెళ్లాలంటే బై సైకిళ్లకు అద్దె కట్టాల్సిందే

**విశాఖపట్నం :** ప్రపంచ బ్యాంకు అప్పులతో చేపట్టిన సదుపాయాలకు యూజర్ ఛార్జీల రూపంలో రాబట్టే కంపెనీ పాలన విశాఖలో రానుంది. విశాఖలో ఏరియా బేస్ట్ డెవలెప్‌మెంట్(ఏబీడీ) కు ఎంపిక చేసిన ఆర్కేబీచ్‌లో రూ.1602 కోట్లతో ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రూ. వెయ్యి కోట్లు డెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా ఖర్చు చేయనున్నారు. మిగిలిన రూ.600 కోట్లు ప్రపంచ బ్యాంకు నుంచి అప్పుగా తీసుకోనున్నారు. బ్యాంకు ఇచ్చే రుణాన్ని తిరిగి రాబట్టగలిగే ప్రాజెక్టులపై ఖర్చు చేయనున్నారు. మల్టీలెవెల్ కార్ పార్కింగ్, అండర్ గ్రౌండ్ కేబుల్, బీచ్ రోడ్ పరిరక్షణ,యూజీడీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఇందులో ఉన్నాయి. ప్రభుత్వ నిధులతో చేపట్టిన సౌకర్యాలను నిర్వహణ పేరుతో పీపీపీకి అప్పగించనున్నారు. అంటే డిజిటల్ పాఠశాలలు, పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ సిగ్నలింక్ వ్యవస్థ, పొల్యూషన్ కంట్రోల్ వ్యవస్థ, సోలార్ రూఫ్ టాప్, బీచ్ బ్యూటిషన్, 24 గంటల తాగునీటి సరఫరా, చెత్త తరలింపు వంటి వాటికి ప్రభుత్వ నిధులతో సౌకర్యాలు కల్పించనున్నారు. తర్వాత వాటిని నిర్వహణ పేరుతో జీవీఎంసీ పాలకవర్గంతో సంబంధం లేకుండా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కమిటీ (పీఎంసీ) ఇష్టానుసారం ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు జీవోలు విడుదలయ్యాయి. అంటే ప్రభుత్వం పెట్టిన పెట్టుబడిపై యూజర్ ఛార్జీల పేరిట ప్రైవేటు సంస్థలు జుర్రుకోనున్నాయి.

**ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టే ప్రాజెక్టులు**

విశాఖలో ఎంపికైన ఆర్కేబీచ్ రానున్న రోజుల్లో ఖరీదైన ప్రాంతంగా మారనుంది. అక్కడ కార్లు పార్కింగ్ చేసేందుకు 4 ఎకరాల్లో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సెంటర్‌ను రూ.66 కోట్ల 90 లక్షలతో నిర్మించనున్నారు. ఆర్కేబీచ్ పరిధిలోని 1700 ఎకరాల్లో అవసరమైన చోటికి కారు,లేదా బైకులో వెళ్లాలంటే కుదరదు. మల్టీలెవెల్ పార్కింగ్ సెంటర్‌లో కారును పార్క్ చేయాలి. అందుకు భారీ మొత్తంలో ఫీజు కట్టాలి. పక్కనే ఏర్పాటు చేసిన బస్టాప్‌లో షేరింగ్ బై సైకిల్‌ను అద్దెకు తీసుకుని అక్కడ పని చక్కెబెట్టుకోవాలి. ఈ పబ్లిక్ రవాణా వ్యవస్థకు రూ.50 కోట్ల 75 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఎలక్ట్రిక్ బైక్ ఛార్జింగ్ స్టేషన్లు, పుట్‌పాత్‌లు, ఎల్ఈడీ డిస్‌ప్లేతో బస్ షెల్టర్లు ఈ ప్రాజెక్టులో భాగంగా అమరుస్తారు. అలాగే అండర్ గ్రౌండ్ కేబుల్‌కు రూ.250 కోట్లు, బీచ్ రోడ్డు కోతకు గురి కాకుండా రక్షణ వ్యవస్థకు రూ.125 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి (యూజీడీ)కి రూ.25 కోట్లతో అంచనాలు తయారు చేశారు. వీటన్నింటినీ ప్రపంచ బ్యాంకు నుంచి తెచ్చే రూ.600 కోట్లతో చేపట్టనున్నారు.

## విశాఖలో గ్లోబల్ బ్లాక్‌చెయిన్ కాన్ఫరెన్స్

**అమరావతి :** సింగపూర్ ప్రభుత్వ సహకారంతో ఈ ఏడాది అక్టోబర్ 9, 10 తేదీల్లో విశాఖలో అంతర్జాతీయ స్థాయిలో బ్లాక్ చెయిన్ కాన్ఫరెన్స్ జరగనుంది. అక్టోబరు నాటికి విశాఖలో ఐటీ రంగం వృద్ధి కోసం 'సిగ్నేచర్' టవర్స్‌ను నిర్మించేందుకు ఐటీ శాఖ చర్యలు చేపడుతోంది. ఇక్కడి ఫిన్‌టెక్ వ్యాలీలో కార్యక్రమాలను విస్త ృతం చేసేందుకు ప్రపంచంలో మేటీ కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న బ్లాక్‌చెయిన్ సదస్సుకు సదరన్ అస్ట్రేలియా ఎగువ సభ అధ్యక్షుడు జోసెఫ్ ప్రత్యేక అతిథిగా హాజరవుతున్నారు

## పాలిటెక్నిక్ సిబ్బందికి కన్సాలిడేటెడ్ పెన్షన్

**అమరావతి :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో పనిచేస్తూ 1995 డిసెంబర్ 31లోపు పదవీ విరమణ చేసిన టీచర్లు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం కన్సాలిడేటెడ్ పెన్షన్‌ను మంజూరు చేసింది. ఉన్నత విద్యాశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

# విద్యుత్ ప్రైవేట్ పరం ?

- నీతి ఆయోగ్ సిఫారసు
- జాతీయ విద్యుత్ విధానం ముసాయిదా సిద్ధం
- ఆగస్టు 20న కేరళ భేటీలో తుది నిర్ణయం


**న్యూఢిల్లీ :** విద్యుత్ సరఫరా ప్రైవేటీకరణకు రంగం సిద్ధమవుతోంది. రుణ గ్రస్థ డిస్కమ్‌ల రక్షణ తదితర సమస్యల పరిష్కారం కోసమంటూ కేంద్ర ప్రభుత్వానికి నీతి అయోగ్ పలు సిఫారసులు చేసింది. జాతీయ విద్యుత్ విధానం పేరిట కేంద్రానికి నీతి అయోగ్ సమర్పించిన ముసాయిదాలో ఈ సిపారసులు ఉన్నాయి. వీటికి కేంద్రం ఆమోద ముద్ర వేయడమంటూ జరిగితే విద్యుత్ సరఫరా విధానాల్లో సమూల మార్పులు చోటు చేసుకునే అవకాశాలున్నాయి. 2015 మార్చి చివరినాటికి రూ.4.3 లక్షల కోట్ల సగటు రుణ భారంతో డిస్కంలు ఉన్నాయి. కాగా, వార్షిక నష్టం రూ.60,000 ల కోట్లుగా ఉంది. అయితే, విద్యుత్ రంగ ప్రైవేటీకరణ అంటే ప్రజల నుంచి గతంలోలా పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తుందనే భయాలూ ప్రభుత్వానికి లేక పోలేదు. ఇందుకుగాను నేరుగా తను చేసినట్లుగా కాక నీతి అయోగ్ సిఫారసుల ముసుగులో విద్యుత్ రంగంలో కీలకమైన సరఫరా విధానాన్ని ప్రైవేటీకరించేందుకు పాలకులు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. తొలుత పాక్షిక ప్రైవేటీకరణను అమలు జరిపి నిదానంగా మొత్తం విద్యుత్ రంగ ప్రైవేటీకరణ జరపాలనేది ప్రభుత్వ యోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సరఫరాను ప్రైవేటు కంపెనీలకు అప్పగించినప్పటికీ గ్రిడ్లపై అజమాయిషీ యాజమాన్య అధికారాలూ సంబంధిత డిస్కంలకే ఉంటాయన్న నీతి అయోగ్ సిఫారసు అనుమానాలు రేపుతోంది. రెండవది, టెలికాం రంగంలో మాదిరిగానే ప్రైవేటు సరఫరా దారులను ఎంపిక చేసుకునే ఐచ్ఛికతను వినియోగదారులు కలిగి ఉంటారన్న మరో సిఫారసూ ఈ అనుమానాలకు బలం చేకూరుస్తోంది. విద్యుత్ డిస్కంల రుణభారం మోయలేనంతగా పెరగడానికి వాటిపై వాణిజ్య రాజకీయ ఒత్తిడులు తీవ్రం కావడమేనని నీతి అయోగ్ విశ్లేషించింది. విద్యుత్ సదుపాయాన్ని ఉచితంగా కానీ భారీ రాయితీలకు కానీ సరఫరా చేయాలంటూ డిస్కంల మీద ఒత్తిళ్లు అధికంగా ఉన్నట్లు తెలిపింది.

**ఒప్పందాలే కీలకం ....**

విద్యుత్ ఉత్పత్తి కంపెనీలతో ప్రైవేటు కంపెనీలు ఒప్పందాలు (కాంట్రాక్ట్) కుదుర్చుకోవాల్సి ఉంది. ఈ ఒప్పందాల ప్రాతిపదికనే ఆయా ప్రైవేటు కంపెనీలు విద్యుత్‌ను కొనుగోలు చేయడం జరుగుతుంది.కొనుగోలు చేసిన విద్యుత్‌ను ఆయా ప్రైవేటు కంపెనీలు అవి ఏర్పాటు చేసుకున్న సరఫరా వ్యవస్థ ద్వారా చిట్టచివరి వినియోగదారునికీ సరఫరా చేయాల్సి ఉంది. విద్యుత్ ఉత్పత్తి స్థానం నుంచి వినియోగదారునికి సరఫరా జరిగే వరకు అన్ని స్థాయిల్లో విద్యుత్ ధర ఆయా రెగ్యులేటర్ల నిర్ణయాధికారానికి లోబడే జరుగుతుంది. ఈ విధానంలో వినియోగదారులు/ ఖాతాదారుల కోసం సరఫరా దారులు/ పంపిణీ దారులు పోటీ పడే అవకాశాలున్నాయనేది నీతి అయోగ్ ఆలోచన. విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ నుంచి గ్రిడ్స్ వేరు చేయడం ద్వారా స్థూల ఉత్పత్తిని సమర్ధనీయమైన ఇంధన వనరుగా బదలాయించడం జరుగుతుందని నీతి అయోగ్ అంచనాగా ఉంది. అనుమతుల అవసరాలు సహా అన్ని నియంత్రణ నుంచి స్థూల ఉత్పత్తికి 2003 విద్యుత్ చట్టం స్వేచ్ఛ కల్పిస్తోందని నీతి అయోగ్ పేర్కొంది. డిస్కంల పేలవమైన ఆర్థిక పరిస్థితికి విద్యుదుత్పత్తి కంపెనీలు భీతిల్లుతున్నట్లు తెలిపింది. డిస్కంలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకునేందుకూ విద్యుదుత్పత్తి కంపెనీలు వెనుకాడుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్న వినియోగదారులకు అవసరమైన విద్యుత్‌ను సకాలంలో అందుబాటులోకి తేలేని పరిస్థితిని ఆయా డిస్కంలు ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు రేపోమాపో అయినా డిస్కంలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోక తప్పదని నీతి అయోగ్ తేల్చి చెప్పడం గమనార్హం. ఈ విషయంలో తుది నిర్ణయం తీసుకునేందుకుగాను ఆగస్టు 20న రాష్ట్రాలన్నీ కేరళలో సమావేశం కానున్నాయి.

# కార్పొరేట్ ఇంద్రజాలానికి దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థం





**రా.వా.ప్రతినిధి- అమరావతి :**

వ్యవస్థను మార్చాలంటే వ్యవస్థలోని పెద్దలతో ఆప్రక్రియను ప్రారంభించాలి. అప్పుడే సామాన్యులు కూడా దానిలో భాగస్వామ్యులవుతారు. అయితే దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు కార్యక్రమాలను రూపొందిస్తున్నాయి. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్‌గా రఘురాం రాజన్ స్థానంలో ఉర్జిత్‌పటేల్ వచ్చిన దగ్గర నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ పెనం మీదనుంచి పొయ్యిమీదకు పడినట్లయింది. రిలయన్స్‌లో పనిచేసిన ఉర్జిత్‌ను కేంద్రం నియమించింది కార్పొరేట్లకు మేలు చేయడానికే అన్నది వేరే చెప్పనక్కర్లేదు. రఘురాం రాజన్ బడాకార్పొరేట్ల బ్యాంకు అప్పులను బయటపెట్టారు. ముఖేష్‌అంబానీ రిలయన్స్ రూ. 1,87,070కోట్లు, అనిల్ అంబానీ రూ.24,956కోట్లు, రూలియా బ్రదర్స్ రూ.1,04,461 కోట్లు, అనిల్ అగర్వాల్ 1,03,340 కోట్లు గౌతం అదాని రూ. 96,031,సైరస్ మిస్త్రి రూ. 80,701 మనోజ్ గౌడ్ రూ.75,163 కోట్లు,సచిన్ జిందాల్ రూ. 58,171, ల్యాంకో మధు రూ. 47,102,జీఎంఆర్ రూ.47,976,విఎన్ దూప్ రూ. 45,400 కోట్లు,జీవీకే రెడ్డి రూ. 33,933 కోట్లు, సహారా, విజయ్‌మాల్యా, శ్రీరేణుకా షుగర్స్ లిమిటెడ్, నవీన్ జిందాల్, డీఎల్‌ఎఫ్‌ఏ బిల్డింగ్ ఇండియాలతో పాటు రూ. 5000 కోట్లకంటే తక్కువ తీసుకున్న వారు ఇంకా చాలామంది ఉన్నారు. మొత్తం కలుపుకొని 28,00,000 కోట్లు మొండిబకాయిలుగా ఉన్నాయని, వీళ్లంతా త్వరలో అప్పులు చెల్లించాలని లేదంటే ఆస్తులు వేలం వేస్తామని రఘురాంరాజన్ నోటీసుల ఇచ్చారు. అయితే వీళ్లంతా మోడీకి మంచి మిత్రులు కావడంతో రాజన్‌ను బేఖాతరు చేశారు. అయితే రాజన్ ఆస్తుల మధింపుకు సన్నాహాలు చేశాడు. ఆయన పదవిలో కొనసాగితే 2016 జూలైలో వేలం పాటలు మొదలయ్యేవి. అయితే ఆసమయంలో కార్పొరేట్ పెద్దలంతా మోడీ సాయంతో రాజన్‌ను సాగనంపి ఆయనస్థానంలో రిలయన్స్‌లో ఉద్యోగం చేసిన ఉర్జిత్‌ను ఆర్‌బీఐ గవర్నర్‌గా చేశారు. రాజన్ వేలం ప్రక్రియ చేపడితే వాళ్లు తీసుకున్న అప్పుఎంత అసలు వారి ఆస్తి ఎంతో తెలిసిపోతుంది. ఉన్న ఆస్తికంటే రెండు రెట్లు అధికంగా బ్యాంకు లోన్లు తీసుకున్నారు. అనిల్ అంబానీ అప్పు - అయితే ఆయన ఆస్తి రూ. 60 వేల కోట్లు,మిగతా డబ్బంతా బ్లాక్‌చేశారు.ఎక్కడా లెక్కలకు దొరకకుండా సర్దుబాటు చేసుకున్నారు. కార్పొరేట్ వ్యాపారులంతా చేసింది ఇదే.. రూపాయలను డాలర్లుగా మార్చి స్విస్ బ్యాంకులో దాచుకున్నారు. ఈబడా వ్యాపారులకు మోడీ చేసిన రుణమాఫీ 1,14000 కోట్లు,ఇది సమాచార హక్కు దాఖలుతో ఆర్‌టీఐ చెప్పిన సమాధానం. అయితే ఎవరెవరికి రుణమాఫీ చేశామో పేర్లు మాత్రం చెప్పబోమని మోడీ తెగేసి చెప్పారు. లిబరలైజ్ రిమిటెన్స్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) కేంద్రం ఈ పథకాన్ని 20004లో ప్రవేశపెట్టింది. దీని ఉద్దేశ్యం విదేశాలకు వెళ్లే భారతీయులు రూపాయలను డాలర్లలోకి మార్చుకొని అక్కడ అవసరం కోసం ఖర్చుపెట్టుకోవడం మొదట 25 వేల డాలర్లు లిమిట్‌గా ప్రవేశపెట్టారు. ఆపై రూ. 50, 75 వేలకు పెంచారు. ప్రస్తుతం దానిని రూ. 1,75 000 పెంచారు. బీజేపీ ప్రతిపక్షంలో ఉండగా ఈస్కీమును రద్దు చేయాలని, దీనివల్లే మన డబ్బు నల్లధనంగా విదేశాలకు చేరుతోందని గోల చేసింది. అయితే అధికారంలోకి రాగానే పరిమితిని రెండు రెట్లు అధికం చేసింది. అంటే ఒక్కొక్కరికీ 2,50,000 డాలర్లుగా ప్రకటించింది. అంతేకాకుండా మైనార్టీ పిల్లలకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేశారు. ఇద్దరు పిల్లలు కల దంపతులు అమెరికా వెళితే 7 కోట్ల రూపాయలను డాలర్లలో మార్చి తీసుకువెళ్ల వచ్చు. ఇలా ఏడాదిలో ఎన్ని దేశాలకైనా ఎన్ని సార్లయినా వెళ్లే సదుపాయాన్ని కల్పించారు. ఈ స్కీంను అడ్డుపెట్టుకొని గత మూడు ఏళ్లలో రూ. 10,వేల 700 కోట్లు. ( అంటే 1.6 బిలియన్ డాలర్లు) 2014-15లో




4.6 బిలియన్ డాలర్లు, అంటే 30వేల 800 కోట్లు,2015-16ల్లో 5 బిలియన్ డాలర్లు, ( 33 వేల 500 కోట్లు.) 016-17ల్లో అంటే ఆర్థిక సంవత్సరానికి ఐదునెలలు ఉండగానే గతేడాది కంటే ఎక్కువే ఉంటుందని భావిస్తున్నారు. అంటే ఈ ఏడాది సుమారుగా 35 వేల కోట్లు వేస్తున్నారు. మొత్తం ఎల్‌ఆర్ ఎస్‌లో దేశం దాటిపోయిన డబ్బు మూడేళ్లలో 1లక్షా 10 వేల కోట్లు ఇదంతా నల్ల ధనమే.. ఇంకో ఆశ్చర్యకర విషయం ఏమంటే ఇదంతా 90 శాతానికి పైగా ఒక్క గుజరాత్ నుంచే బయటకు వెళుతోంది. ఉపయోగించుకుంది కూడా ఈ రాష్ట్ర కార్పొరేట్ వ్యాపారులే. గుజరాత్‌లో ఈ వ్యవహారాలను చక్కబెట్టడానికి ప్రత్యేక కంపెనీలు కూడా ఉన్నాయి. ఆంధ్రాలో ఎమ్మెస్ చేయడానికి విదేశాలకు వెళ్లే విద్యార్థులకు కన్సల్టెన్సీలు ఉన్నట్లే గుజరాత్‌లో విదేశాలకు డబ్బు తీసుకెళ్లే వాళ్ల కోసం హవాలా కంపెనీలు ఉన్నాయి. అమెరికాలోని గుజరాతీయులు ఇండియా నుంచి నల్లధనాన్ని తీసుకువెళ్లి అమెరికాలోపెద్ద వ్యాపారాలు చేస్తుంటారు. గుజరాతీయులు ఎవరూ అమెరికాలోఉద్యోగం చేయరు. అమెరికాలోని హోటళ్లలో 40 శాతం గుజరాతీయులవే. అమెరికా అంతటా 53 వేల హొటళ్లు ఉంటే దానిలో 21వేల హోటళ్లు గుజరాతీయులవే. ఇండియా నుంచి బ్లాక్ మనీ తరలించి అక్కడ వ్యాపారాలు చేస్తున్నారు.

అమెరికాలో రాజకీయపార్టీలకు చందాలిచ్చేది కూడా వారే. గుజరాతీయలు దేశభక్తి గురించి చెప్పాలంటే దేశంలో 121 క్యాడిడేట్స్‌తో హర్యానా అగ్రస్థానంలో ఉంటే,పంజాబ్ 2 స్థానం, ఆపై మిగతారాష్ట్రాలన్నీ ఉన్నాయి. గుజరాత్ స్థానం ఏమంటే ఒకే ఒక్క కేడిడేట్‌తో ఆఖరి స్థానంలోఉంది. దీనిపై సునీతాసింగ్ చేసిన వ్యాఖ్య ఏమంటే నాజీవితమంతా ఆర్మీలో చేసి పదవీవిరమణ చేశాను. నా సర్వీసు మొత్తంలో ఒకరో ఇద్దరో గుజరాతీయలు ఎదురుపడ్డారని చెప్పారు. ఇది భారతసైన్యంలో గుజరాత్ పాత్ర.

### జాతి సంపద అంబానీ పరం

1977లో ధీరూభాయి అంబానీ సంపద కేవలం రూ.33 కోట్లు, 2017లో అది రూ. 7 లక్షల కోట్లకు చేరింది టర్నోవర్ 70 కోట్ల నుంచి 3.30 వేల కోట్లకు చేరింది. నికరలాభం రూ. 3 కోట్ల నుంచి రూ. 30 వేల కోట్లకు పరిగెత్తింది.



### ఇదెలా సాధ్యమయిందో మీకు తెలుసా ?



- బ్యాంకురుణాలు 1.85 లక్షల కోట్లు ఎగనామం పెట్టడం,
- కేజీ బేసినఎలో గ్యాసఎ రూ. 10వేల కోట్లు అక్రమంగా దోచుకోవడం,
- 4జీ సేవల కోసం కోట్లు విలువ చేసే తరంగాలను ఉచితంగా మోడీ దోచిపెట్టడం,
- టెలీ సర్వీసుల లెక్కలు 61 వేలకోట్లు తక్కువగా చూపడం

కారణాలని కాగ్ తన నివేదికలో పేర్కొంది. జాతిసంపద అలా అంబానీకి దోచిపెట్టడం మూలంగా దేశసంపద వ్యక్తుల చేతిలోకి వెళ్లింది.

### రద్దయిన నోట్లపై గోప్యత

పెద్దనోట్ల అనంతరం బ్యాంకుల్లో జమ అయిన మొత్తాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచుతోంది. పెద్దనోట్లరద్దు జరిగి ఎనిమిది నెలలు అయినప్పటికీ ఇంకా ఎందుకు వెల్లడించడం లేదని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. నల్లధనం, ఉగ్రవాదం, నకిలీ కరెన్సీ కట్టడిచేస్తామని కేంద్రం ప్రకటించి దానివల్ల ఎటువంటి ప్రయోజనం లభించ లేదని సామాన్యులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. గ్రామీణ బ్యాంకు సేవల నుంచి పట్టణప్రాంత బ్యాంకులకు అక్కడి నుంచి మెయినఎ బ్రాంచికి, అక్కడి నుంచి సెంటరుకు ప్రతిరోజు ఎన్ని రకాల నోట్లు ఎంతమొత్తంలో వెళ్లాయన్నది ప్రతిరోజు లెక్కిస్తారు. అలాంటిది ఇంతవరకు లెక్కపెట్టలేదన్న ఆర్‌బీఐ గవర్నర్ సమాధానం ఎంతటి బాధ్యతారాహిత్యమో తెలుస్తోంది. నోట్ల రద్దుకు ముందు నోట్లు ముద్రించాలన్న కనీస పరిజ్ఞానం లేని ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ కు కేంద్రప్రభుత్వం జీతాలను రెట్టింపు చేసింది. రూ. 90 వేల నుంచి ఒక్కసారిగా రూ.2.25 లక్షలకు పెంచింది. ఆర్‌బిఐలోని మిగతా ఉన్నతాధికారుల జీతభత్యాలు ఇప్పటికీ జాతీయ రంగ బ్యాంకుల్లోని అధికారులకంటే తక్కువే అని వాపోతుండటం కొసమెరపు.

## నీతా అంబానీ రూ. 300 కోట్ల ఫోను

ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరైన రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ,ఆయన కుటుంబ సభ్యుల జీవనశైలి వారి స్థాయికి తగ్గట్టుగానే ఉంటుందన్న విషయం బహిరంగమే. రూ. 12000 కోట్లతో కళ్లు చెదిరే ఇల్లు కట్టినా రూ.25 కోట్లతో కారు కొనుగోలు చేసినా అది వారికే సాధ్యం. దాదాపు 160 లగ్జరీ కార్లు ఆయన నివాసంలో ఎప్పుడూ కొలువు తీరి ఉంటాయి.వీటికి తోడు సొంత విమానాలు కూడా...ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో, ఎన్నెన్నో.ఈ జాబితాలో తాజాగా ఓ మొబైల్ ఫోన్ కూడా వచ్చి చేరింది.ముఖేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్ టాక్ ఆఫ్ ది వరల్డ్‌గా మారింది.ఈ సెల్ ఫోన్ ధర ఎంతో తెలిస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే.ఈ మొబైల్ ధర సింపుల్ గా 48.5 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో అక్షరాలా రూ.300 కోట్లు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన'ఫాల్కన్ సూపర్ నోవా ఐ ఫోన్ 6 పింక్ డైమండ్ ఫోన్'ను నీతా ఉపయోగిస్తున్నారు.ఈ ఫోన్లను




కేవలం ఆర్డర్ పైనే తయారు చేస్తారు. మొత్తం బంగారాన్ని వినియోగించే ఈ ఫోన్ వెనుక వైపు గులాబీ రంగులో ఉన్న వజ్రాన్ని కూడా అమర్చారు.

-బోస్

## గృహనిర్మాణ పథకం

# పిల్లి మొగ్గలు



**రా.వా.ప్రతినిధి- అమరావతి :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం పిల్లి మొగ్గలు వేస్తోంది. ఆది నుంచి ఈ పథకం ముందుకు సాగటంలేదు పథకాన్ని ప్రకటించిన తర్వాత కార్యరూపం దాల్చేందుకు దాదాపు ఏడాది సమయం పట్టగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసిన ఈ పథకానికి అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. గృహనిర్మాణం యూనిట్ విలువ మొదలు, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేంత వరకు పథకం అమల్లోకి వస్తుందో రాదోనన్న మీమాంస నెలకొనగా పథకం అమలు జరుగుతున్న సమయంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ( ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎన్) లో నిధుల మంజూరు జాప్యం లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తోది. 2016-2017 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో రెండు లక్షల ఎన్‌టీఆర్ గృహాలను ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటికీ 10 శాతం కూడా ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవటం గమనార్హం ఇళ్ల పేరుతో ఓట్లు పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2017-2018, 2018-2019 సంవత్సరాలకు 2 లక్షల ఇళ్లను మంజూరు చేసింది పాత ఇళ్ల లబ్ధిదారులు పడుతున్న బాధలను చూస్తున్న ప్రజలు కొత్త ఇళ్ల నిర్మాణంపై అంతగా దృష్టి పెడుతున్నట్లు కనిపించటంలేదు.

రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారమే 1.12 శాతం ఎన్‌టీఆర్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. గత ఏడాది ఏప్రిల్ 14న సీఎం చంద్రబాబు ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయగా, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. కాని ఇప్పటికీ మరో 10 వేల మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలనే ప్రారంభించలేదు. గృహనిర్మాణశాఖ లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 2,249 ఇళ్లు పూర్తవ్వగా,35 వేల ఇళ్ల నిర్మాణాలు బేస్‌మెంట్‌కు దిగువన, మరో 50 వేల ఇళు బేస్‌మెంట్‌స్థాయిలో ఉన్నాయి. స్లాబ్ దశలో 18 వేల ఇళ్ల, రూఫ్‌కాస్టింగ్ దశలో మరో 55 వేల ఇళ్లు ఉన్నాయి. స్లాబ్ దశ దాటిన తర్వాతే ఇళ్ల నిర్మాణాలు దాదాపు మందగించాయి. ఎన్‌టీఆర్ ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటా నిధులను మంజూరు చేస్తుండగా, కేంద్రం ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేయాల్సిన రూ.58 వేలు విడుదల కాకపోవడంతో చాలా మంది లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

### నిర్మాణ ఖర్చే రూ.1.80లక్షలు

ఎన్‌టీఆర్ గృహనిర్మాణ పథకం కింద మంజూరైన ఇళ్లలో ఒక్కో ఇంటి నిర్మాణానికే రూ.1.80 లక్షలు ఖర్చవుతోంది. కాని ప్రభుత్వం ఒక్కో ఇంటికి స్వచ్ఛభారత్ కింద వ్యక్తిగత మరుగుదొడ్డితో కలిపి రూ.1.50 లక్షలనే కేటాయించింది. పట్టణ వాతావరణం ఉన్న గ్రామాల్లో నిర్మాణ ఖర్చు రూ.2 లక్షలు దాటుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు. దీంతో ఎన్‌టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే 400 అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కనీసం నాలుగైదు లక్షల రూపాయల ఖర్చవుతోందని లబ్ధిదారులు చెబుతున్నారు. పిల్లర్లు వేసి, బేస్‌మెంట్‌స్థాయికి తీసుకువచ్చేందుకు తాపీ కూలీతో పాటు మెటీరియల్ కోసం సుమారు రూ.లక్ష ఖర్చవుతోంది. బేస్‌మెంట్ నుంచి స్లాబ్ స్థాయి కనీసం రూ.1.50లక్షలు, ఆతర్వాత మరో రూ.1.50 లక్షల వరకు ప్లాస్టింగ్,తలుపులు, కిటికీలకు వ్యయం చేయాల్సి వస్తోందని లబ్ధిదారులు చెబుతున్నారు. కాని ఇవేమి పట్టించుకోకుండా ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలనే కేటాయించటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఇదిలావుండగా, దశల వారీగా ప్రభుత్వం బిల్లులను విడుదల చేస్తుందనే ధీమాతో బయట అప్పు తెచ్చి నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులు ఇపుడు నానా తంటాలు పడుతున్నారు. ఒకవైపున బిల్లులు మంజూరు కాకపోగా, మరోవైపు వడ్డీలు పెరుగుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

### 2 నెలలుగా విడుదలకాని ఉపాధి నిధులు

ఉపాధి హామీ పథకం కింద గృహనిర్మాణానికి రెండు నెలల నుంచి నిధులు మంజూరు కావటంలేదు. దీంతో పలు జిల్లాల్లో ఇళ్ల నిర్మాణాలు దాదాపు స్తంభించిపోయాయి. ఉపాధి నిధుల మంజూరులో జాప్యం వల్లే బిల్లుల చెల్లింపు నిలిచిందని హౌసింగ్ అధికారులే చెబుతున్నారు.

### గ్రౌండింగ్‌లో నెల్లూరు ఫస్ట్

ఎన్‌టీఆర్ గృహనిర్మాణ పథకం కింద నిర్మాణాలు గ్రౌండ్ కావటంతో ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఆ జిల్లాల్లో మంజూరైన 11,200 ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు చేపట్టారు. తర్వాత స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా ఉంది. ఆ జిల్లాలో మరో ఆరుగురు లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉంది. కాగా, అత్యధికంగా 837 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి పశ్చిమ గోదావరి జిల్లా మొదటి స్థానంలో నిలవగా, 373 ఇళ్లలో నెల్లూరు రెండోస్థానంలో ఉంది.

**ఎన్‌టీఆర్ గృహ నిర్మాణ పథకం**

| జిల్లా పేరు | కేటాయింపు | ప్రారంభంకానివి | పూర్తయినవి |
|---|---|---|---|
| శ్రీకాకుళం | 12,500 | 1,555 | 10 |
| విజయనగరం | 10,900 | 744 | 77 |
| విశాఖపట్నం | 12,950 | 748 | 04 |
| తూర్పు గోదావరి | 24,003 | 770 | 77 |
| పశ్చిమగోదావరి | 18,504 | 6 | 837 |
| కృష్ణా | 16,990 | 844 | 101 |
| గుంటూరు | 18,400 | 1,168 | 46 |
| ప్రకాశం | 14,368 | 703 | 227 |
| నెల్లూరు | 11,200 | 0 | 373 |
| చిత్తూరు | 15,600 | 1,308 | 133 |
| కడప | 10,562 | 926 | 159 |
| అనంతరం | 17,400 | 1,807 | 74 |
| కర్నూలు | 16,036 | 896 | 131 |
| **మొత్తం** | **2,00,00** | **11,275** | **2,249** |

## గ్యాస్ సిలిండర్‌పై

# ప్రతినెలా రూ. 4 పెంపు

- చమురు కంపెనీలకు ఆదేశాలు
- నొప్పి తెలియకుండా బొప్పి..
- 10 సార్లు ధరలు పెంచిన వైనం



**న్యూఢిల్లీ :** గ్యాస్ సిలిండర్లపై ఇస్తున్న సబ్సిడీకి స్వస్తి చెప్పడం ద్వారా గ్యాస్ (ఎల్‌పీజీ) వినియోగదారులపై భారం మోపేందుకు రంగం సిద్ధమైంది. వినియోగదారుడికి నొప్పి తెలియకుండా ముందుగానే సంసిద్ధం చేసేందుకు కేంద్రం వ్యూహం పన్నింది. ఒకేసారి సబ్సిడీ ఎత్తేస్తే వినియోగదారుడి నుంచి నిరసన ఎదుర్కొవలసి వస్తుందని గ్రహించిన ప్రభుత్వం నెలకు నాలుగు రూపాయల చొప్పున గ్యాస్ ధర పెంచూతూ దశల వారీ తరహాలో సబ్సిడీని ఎత్తేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ విషయాన్ని స్వయంగా లోక్‌సభలో చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాని తెలిపారు. 14.2 కేజీల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్‌పై నెలకు రెండు రూపాయల చొప్పున ( వ్యాట్ కాకుండా) పెంచాలని ఇంతకుముందే ఇండియన్ ఆయిల్ కంపెనీ ( ఐఓసీ) భారత్ పెట్రోలియం ( బీపీసీఎల్) హిందూస్థాన్ పెట్రోలియం ( హెచ్‌పీసీఎల్) కంపెనీలను ప్రభుత్వం ఆదేశించింది సబ్సిడీలకు ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా మంగళం పాడేందుకు రెండు రూపాయల ప్రతిపారనను నాలుగు రూపాయలకు పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విషయాన్ని లోక్‌సభలో రాతపూర్వకంగా మంత్రి తెలిపారు. సంవత్సరానికి ప్రతి ఎల్‌పీజీ వినియోగదారుడు 14.2 కేజీల బరువున్న 12 సిలిండర్లను పొందుతున్నాడు. ఇంతకన్నా ఎక్కువ సిలిండర్లు &కావాలంటే మార్కెట్ ధరకు కొనుగోలు చేస్తున్నారు 2016 జూలై ఒకటి నుంచి నెలకు ప్రతి సిలిండర్‌పై రెండు రూపాయల వరకు పెంచుకునేందుకు ప్రభుత్వరంగ చమురు సంస్థలకు అధికారమిచ్చామని మంత్రి చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు చమురు కంపెనీలు పదిసార్లు ధరలు పెంచాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి ఎల్‌పీజీ సిలిండర్లపై మొత్తం సబ్సిడీని ఉపసంహరిస్తామని ఆయన తెలిపారు. 2017 జూన్ ఒకటో తేదీ నుంచి గృహా వినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌పై నెలకు నాలుగు రూపాయల చొప్పున పెంచాలని చమురు సంస్థలకు తాజా ఉత్తర్వేలు కేంద్రం జారీచేసింది వ్యాట్ కాకుండా పెరిగే ఈ ధరతో వచ్చే మార్చి నాటికి సిలిండర్లపై సబ్సిడీ పూర్తిగా ఎత్తివేసే అవకాశం కలుగుతుందని మంత్రి చెప్పారు. గత జూన్ ఒకటో తేదీన ఈ పెంపును ఏకంగా అత్యధిక స్థాయిలో సిలిండర్‌కు 32 రూపాయల చొప్పున పెంచాయి. ఇంత పెద్దమొత్తంలో అంతకుముందు ఆరేళ్లలో జరగలేదు ఢిల్లీలో గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ప్రస్తుతం 477.46 రూపాయలున్నది గత జూన్‌లో ఈ ధర 419.18 రూపాయలుగా ఉన్నది. సంవత్సరానికి 12 సిలిండర్ల కోటాను మించి కావలసిన వినియోగదారుడు మార్కెట్లో సబ్సిడీ లేకుండా 564 రూపాయలకు పొందుతున్నాడు. ఇతర సిలిండర్ల ( అంటే 5 కేజీల సిలిండర్లు) ధరలు కూడా తదనుగుణంగా పెరుగుతాయని ప్రధానితెలిపారు. జూలై నెలకు 14.2 కేజీల సిలిండర్‌కు సబ్సిడీ కింది 86.54 రూపాయలు లభించాయి. దేశంలో మొత్తం 18.11 కోట్ల మంది సబ్సిడీ వినియోదారులున్నారు. వీరిలో నిరుపేద వర్గాలకు చెందిన 2.5 కోట్ల మంది మహిళలున్నారు. వీరికి గత ఏడాది ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింది ఉచితంగా పంపిణీ చేశారు.

## అసెంబ్లీ సీట్ల పెంపు ఇప్పట్లో లేనట్లే

### కేంద్రం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో శాసనసభ నియోజకవర్గాల పెంపు అంశంపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఇరు రాష్ట్రాలలో అసెంబ్లీ స్థానాలు పెంచాలని ఏపీ, తెలంగార్ఝణ రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని పలుమార్లు కోరాయి. దీంతో సీట్లు పెరుగతాయనే ప్రచారం పెద్దఎత్తున జరిగింది. ఈ ప్రచారానికి చెక్‌పెడుతూ కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 170ని సవరించకుండా తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపు సాధ్యం కాదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ స్పష్టం చేశారు.

విభజన చట్టం ప్రకారం ఈ రెండు రాష్ట్రాలలో సీట్ల పెంపు అంశంపై లోక్‌సభలో తెలుగుదేశం పార్టీ ఎంపీ మురళీమోహన్, టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. సీట్ల పెంపు అంశంపై ఇప్పటికే న్యాయశాఖను సంప్రదించినట్టు ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3) ప్రకారం 2026 వరకు అసెంబ్లీ సీట్ల పెంపు కుదరదని అటార్నీ జనరల్ అభిప్రాయపడినట్లు మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు.

## విజయవాతంతంతంతంతడకు లైట్ మెట్రో


- మొత్తం 26.3 కి.మీ • మూడు కారిడార్లు ఏర్పాటు

**రా.వా ప్రతినిధి- అమరావతి :** విజయవాడ నగరానికి లైట్ మెట్రో అన్ని విధాలా అనుకూలంగా ఉందని మంత్రి నారాయణ తెలిపారు. లైట్ మెట్రో ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఎడ్వర్డ్ బృందం, జర్మనీకి చెందిన ప్రజా రవాణా రంగ నిపుణుడు అడ్వర్డ్ డాట్సన్ లైట్ మెట్రో రైలు సూచించారన్నారు. లైట్ మెట్రో రైల్ వ్యవస్థ వ్యయం మొత్తం 4,273 కోట్ల అంచనాగా రూపొందించారు. మొత్తం మూడు కారిడార్‌లుగా ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన మార్గం నిడమానూరు నుంచి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ వరకు (13.27 కి.మీ), ప్రధాన మార్గం. 2..పెనుమలూరు నుంచి పండిట్ నెహ్రూ బస్టేషన్ వరకు (12.76 కి.మీ) లైట్ మెట్రోలో 2 నుండి 6 కోచ్ వరకు ఉంటాయన్నారు. మెట్రో రైల్ సరాసరి వేగం 35 కిలోమీటర్లు, ఒక్కో కిలోమీటర్ ఏర్పాటుకు 164.16 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. మొత్తం లైట్ మెట్రో రైల్ 26 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని, రానున్న కాలంలో లైట్ మెట్రోను అమరావతి, గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి పొడిగించే వీలుందన్నారు. లైట్ మెట్రో ఏర్పాటుకు మొత్తం 60 ఎకరాల భూసేకరణ అవసరం. ఇందుకు 600 కోట్లు ఖర్చు అవుతుందని మంత్రి వెల్లడించారు.

# ఆంగ్లేయుల్లో భయోత్పాతాన్ని పుట్టించిన 'మౌల్వీ'


### మౌల్వీ అహ్మదుల్లా షాహ్ ఫైజాబాది
### (1787-1858)

9 బ్రిటిష్ పాలకులపై కత్తి గట్టి ఆంగ్లేయుల సైనిక శిబిరాలలో భయోత్పాతాన్ని పుట్టించిన 'మౌల్వీ' అహ్మదుల్లా షాహ్ ఫైజాబాది' తమిళనాడులోని ప్రస్తుతం చెన్నయ్‌గా పిలువబడుతున్న మద్రాసులో 1787లో జన్మించారు. ఆయన తండ్రి ముహమ్మద్ అలీ ఖాన్.మౌల్వీ అసలు పేరు సయ్యద్ అహ్మద్ అలీఖాన్, చిన్నతనంలోనే ధార్మిక, లౌకిక విద్యలో సాధించిన విద్వత్తు ఫలితంగా 'మౌల్వీ'గా ప్రసిద్ధిగాంచారు. ఆయన పలు యుద్ధవిద్యలలో ఆరితేరారు. నిజాం నవాబు ఆహ్వానం మేరకు ఇంగ్లాండు, మక్కా–మదీనా,ఇరాక్,ఇరాన్, తదితర ప్రాంతాలను మౌల్వీ పర్యటించారు. స్వదేశం వచ్చిన మౌల్వీ అహ్మదుల్లా 'సూఫీ' సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై 'ఖాద్రి' సంప్రదాయానికి చెందిన సయ్యద్ ఫుర్‌ఖాన్ అలీ షాహ్ శిష్యులయ్యారు. గురవాజ్ఞ మేరకు గ్వాలియర్ ప్రాంతంలో సూఫీ భక్తి తత్వాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో స్వదేశీయుల మీద విదేశీ శక్తుల సాగిస్తున్న పెత్తనాన్ని నిరసిస్తూ,దాన్ని అంతం చేసేందుకు ధర్మయుద్ధానికి సిద్ధం కావాల్సిందిగా ప్రజలను ప్రేరేపిస్తూ ప్రసంగాలు ఆరంభించారు. ఆగ్రహించిన ఆంగ్లేయాధికారులు ఆయన మీద రాజద్రోహం నేరం మోపి నిర్బంధించారు. ఆ సమయంలో1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ఆరంభం అయ్యింది. ఆ సమరంలో భాగంగా మౌల్వీ అహ్మదుల్లా షాహ్ బ్రిటిష్



బలగాలతో తలపడటం ఆరంభించి పలు చోట్ల ఆంగ్లేయ సైన్యాలను మట్టికరిపించి అజేయులుగా నిలిచారు. ప్రథమ స్వాతంత్ర్య సమర యోధులు సర్దార్ హిక్మతుల్లా, అవధ్ రాణి బేగం హజరత్ మహల్, రోహిల్ ఖండ్ అధినేత ఖాన్ బహుదూర్ ఖాన్, మొగల్ రాకుమారుడు ఫిరోజ్ షాహ్‌లు లాంటి ప్రముఖులు ఆంగ్లేయుల మీద సాగించిన పోరాటాలలో మౌల్వీ అహమ్మదుల్లా ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆ కారణంగా ఆ యోధుణ్ణి పట్టి బంధించిన వారికి గానిని ఆయన శిరస్సును ఖండించి తెచ్చిచ్చిన వారికి గాని ఈస్ట్ ఇండియా కంపెనీ 50,000 రూపాయల నజరానా ప్రకటించింది. ఈ నజరానా కోసం పోవెన్ రాజు జగన్నాథ సింహుడి సోదరుడు ఆశపడ్డాడు. జగన్నాథ సింహుడి ఆహ్వానం మీద చర్చల కోసం మౌల్వీ పోవెన్ వచ్చారు. అదను కోసం ఎదురు చూస్తున్న రాజు సోదరుడు 'రాజా ప్రక్కనే ఉన్న... మౌల్వీపై గురిచూసి కాల్పులు జరిపాడు. ఆ దుర్మార్గుని చేతుల్లో మౌల్వీ హతుడైపోయాడు. ఆ పిరికి పందలు... మౌల్వీ శిరస్సు ఖండించి,దానిపై గుడ్డ కప్పుకొని చేరువనే 13 మైళ్ల దూరాన ఉన్న బ్రిటీషురాణి షాజహాన్‌పూర్‌కు తీసుకువెళ్లారు. రక్తం ఓడుతున్న ఆ పవిత్ర శిరస్సును ఆ నీచులు ఆంగ్లేయుల ముందు కానుకగా ఉంచి వారి పాదాల చెంత మోకరిల్లారు... నీచమైన దేశ ద్రోహానికి తలపడిన ఆ 'పోవెన్ పశువు'కు 50 వేల రూపాయల పారితోషికం లభించింది!'. ఆ విధంగా మౌల్వీ 1858 జూన్ 15న అమరులయ్యారు. మౌల్వీ అహమ్మదుల్లా షాహ్ ఫైజాబాది మరణ వార్తను ఖచ్చితంగా ధృవపర్చుకున్నాక 'ఉత్తర భారతదేశంలో బలిష్టమైన శత్రువు' అడ్డు తొలిగించిన ఆంగ్ల సైన్యాధికారులు ఆనందపడ్డారు.

**(ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు ఆల్బమ్ 'చరితార్థులు' నుంచి....)**




**Syed Naseer Ahamed**
**Mobile: 9440241727.**
**E-mail: naseerahamedsyed@gmail.com**

# పావుగంటలో పాస్‌బుక్..

### రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో ఎన్ఐసీ సహకారం

**రా.వా ప్రతినిధి– అమరావతి :** ఇకపై పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన అవసరం లేదు. కేవలం రూ.25 రూపాయల చెల్లింపుతో దరఖాస్తు చేసిన పావుగంటలో పట్టాదార్ పాస్ పుస్తకం మన చేతిలో వుంటుంది. రెవెన్యూశాఖ తాజాగా నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సహకారంతో ప్రవేశపెట్టిన ఐటీ ఆధారిత నూతన సేవల్లో భాగంగా సీఎం చంద్రబాటు సచివాలయంలో ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ నీతావర్మతో కల్సి ఎలక్ట్రానిక్ పట్టాదార్ పాస్ పుస్తకాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మీ భూమి వెబ్ పోర్టల్ విశేషాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ప్రభుత్వ శాఖల డిజిటలైజేష ఆన్‌లైన్ సేవలు, ఇ– ప్రగతి వంటి కార్యక్రమాలను అమలు చేసి దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఏపీ రోల్‌మోడల్‌గా నిల్చిందని చంద్రబాటు ఎన్ఐసీ డీజీకి తెలిపారు. సహజంగా ప్రభుత్వ కార్యాలయలంటే ఇనుప బీరువాలో దుమ్ము పేరుకుపోయి వుండే పైళ్ళే గుర్తుకు వస్తాయని, అటువంట పరిస్థితి నుంచి చేతిలో వుండే సెల్‌ఫోన్ ద్వారానే ఫైల్ క్లియర్ చేసే సంస్కరణలు తీసుకొచ్చామని చెప్పారు. అవినీతి, అవకతవకలకు చోటు లేని అత్యంత వేగంగా పనులు జరిగే విధానాలతో పూర్తి పారదర్శక పాలన అందించాలన్న లక్ష్యంతోనే సాంకేతికంగా ప్రపంచవ్యాప్తంగా వున్న అత్యుత్తమ పద్ధతులను అనుసరిస్తున్నామన్నారు. దాదాపు 30కి పైగా అంశాల్లో ఏసీ మిశ్రా కొనియాడారు. మీ సేవ కేంద్రాలు, మీభూమి పోర్టల్ ద్వారా భూమి హక్కు పత్రం పట్టాదార్ పాసు పుస్తకం ముద్రణను 15 నిముషాల్లోనే పొందే వినూత్న సదుపాయం గురించి సీపీఎల్ఏ అనిల్ చంద్ర పునీటా సీఎంకు సమగ్రంగా వివరించారు. పాతపద్ధతిలో పట్టాదారు పాస్ పుస్తకం పొందాలంటే కనీసం నెలరోజులు సమయం పట్టేదని, ఇప్పుడు రూ.25 ల ఖర్చుతో కేవలం పావుగంటలోనే దానిని పొందే వీలు




కల్పించామని చెప్పారు. భూశోధక్ అనే ఆండ్రాయిడ్ అప్లికేషన్ ద్వారా పత్రాలు సరైనవో లేదో తెల్సుకోవచ్చునని తెలిపారు. మొత్తం 48 లక్షల ఎఫ్ఎంబీలకు 39 లక్షల డిజిటలైజేషన్ పూర్తయిందని, సెప్టెంబరు నెలాఖరునాటికి మొత్తం ప్రక్రియను పూర్తిచేస్తామని రాష్ట్రంలో 17,424 గ్రామాలకు సంబంధించిన డిజిటల్ విలేజ్ ప్లాన్ల పనులు కూడా అక్టోబరు చివరి నాటికి పూర్తవుతాయని వివరించారు. విజయనగరం, విశాఖ, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 34 ఎస్టేట్, ఇనామ్ గ్రామాల్లో ల్యాండ్ సర్వే చురుగ్గా సాగుతోందని అధికారులు తెలియజేయగా వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తచేయాలని సీఎం ఆదేశించారు. ఈసమావేశంలో యూఐడీఏంఐ చైర్మన్ జె. సత్యనారాయణ, ప్రత్యేక ప్రధానకార్యదర్శులు సతీష్ చంద్ర, మన్మోహన్‌సింగ్, సీఎం అదనపు కార్యదర్శి ఏవీ రాజమౌళి పాల్గొన్నారు.

## అక్టోబరు 1 నుంచి మరణ ధ్రువీకరణకు ఆధార్ తప్పనిసరి

**న్యూఢిల్లీ :** అస్సాం, మేఘాలయ, కాశ్మీర్ మినహా అన్ని రాష్ట్రాలలో మరణ ధ్రువీకరణకు 2017, అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఆధార్ సంఖ్యను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆ మూడు రాష్ట్రాలలో ప్రత్యేకంగా ఒకతేదీని ప్రకటిస్తామని హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మరణించిన వ్యక్తికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీ నంబరు లేదా ఆధార్ సంఖ్య లేకుండా మరణ ధ్రువీకరణ పత్రం కోసం ఒక వ్యక్తి దరఖాస్తు చేసినట్లయితే, సర్టిఫికెట్ అవసరమైన అతను లేదా ఆమె ఆధార్ సంఖ్య లేదని డిక్లరేషన్ ఇవ్వాలని ప్రకటన తెలిపింది. అయితే దరఖాస్తుదారుడు తప్పుడు ధ్రువీకరణ ఇస్తే ఆధార్ చట్టం– 2016, జనన, మరణ నమోదు చట్టం – 1969 నిబంధనల ప్రకారం శిక్షార్హుడని వివరించింది. భార్య లేదా తల్లిదండ్రుల ఆధార్ సంఖ్యతోపాటు దరఖాస్తుదారుడి ఆధార్ సంఖ్యను సేకరించాల్సి ఉంటుంది. దేశ జనాభా గణన చేసేందుకు, జనన, మరణ నమోదుల నిర్వహణ కోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) ఈ నోటిషికేషన్ జారీ చేసిందని మంత్రిత్వశాఖ పేర్కొంది.

## నేడు,రేపు
## గ్రూపు- 3 మెయిన్స్

**రా.వా ప్రతినిధి– అమరావతి :** గ్రూప్–3 మెయిన్స్ పరీక్షలు ఆగస్టు 6,7 తేదీలో జరుగుతాయని ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయభాస్కర్ చెప్పారు. ఈ నెల 6న ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలతో పాటు హైదరాబాద్–1లోని 135 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. 7వ తేదీన విజయనగరం, తూర్పుగోదావరి, నెల్లూరు, కర్నూలు జిల్లాలో పాటు హైదరాబాద్–2 లో ఏర్పాటు చేశామన్నారు.


# మన కోసం

| | | | |
|---|---|---|---|
| శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |

**రెస్టారెంట్స్**

| | | | |
|---|---|---|---|
| బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |

**షాప్స్**

| | | | |
|---|---|---|---|
| రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |

**ట్రేడర్స్**

| | | | |
|---|---|---|---|
| సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

**మ్యారేజీ లింగ్స్**

| | | |
|---|---|---|
| షేక్ జానీ | విజయవాడ | 9948450761 |


## ఆర్టీసీ వడ్డింపు

### మినిమం తగ్గించి మాగ్జిమం పెంచారు

**రా.వా.ప్రతినిధి– విజయవాడ :** విజయవాడ విశాఖపట్నం నగరాల్లో సిటీ బస్సు మినిమం ఛార్జీలు తగ్గిస్తున్నాట్లు ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. సిటీ బస్సులకు ఆటో బెడద ఎక్కువైంది. సిటీ బస్సుల కంటే ఆటోవాలాలు తక్కువ ఛార్జీతో తీసుకెళుతుండడంతో ఆర్టీసీకి తీవ్ర సష్టం వాటిల్లుతోంది. స్టూడెంట్స్ ఇతర రాయితీల పాస్ హోల్డర్స్ మినహా ఎప్పటికప్పుడు డబ్బు చెల్లించే ప్రయాణీకులు ఆటోలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిటీ బస్సు ఛార్జీలు తగ్గింపును ఒక అస్త్రంగా యాజమాన్యం ప్రయోగించింది. ముఖ్యంగా విజయవాడ విశాఖపట్న నగరాల్లో అత్యధికంగా అత్యధికంగా ప్రజలకు రవాణా సౌకర్యమందించే మెట్రో ఆర్డినరీ సిటీ బస్సు చార్జీలను తగ్గించింది. ఆర్టినరీ మెట్రో రెండింటికీ మినిమమ్ ఛార్జీగా రూ 5లకు తగ్గిస్తూ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది గతంలో మెట్రోకి కనీసం ఛార్జీ రూ.8 ఆర్డినరీ బస్సుకు రూ. 7 లు వుండేదని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఐ వెంకటేశ్వరరావు విజయవాడ ఆర్ఎం పీవీ రామారావు తెలిపారు.

# వెలుగులు పంచే దీపాలు



ఈమధ్య డ్రగ్స్ గురించిన వార్తా కథనాలనేకం చూశాం. నిజానికి అవి మనసుని కల్లోలపెట్టి అశాంతికి గురిచేసే చేదు వాస్తవాలు. జీవితంలో ఎలా ఎదగాలి, తోటివారికి ఎలా సాయం చేయాలి, మనం సుఖంగా సంతోషంగా ఉండేందుకు ఏం చేయాలి – లాంటి ఆలోచనలు మానేసి మత్తులో జోగడమేంటి కదా?! ఇది మనకు మింగుడుపడదు, కనీసం అర్థం కాదు కూడా! ఒకరకంగా ఈజీమనీ తెచ్చిపెడుతున్న అరాచకాలేమో అనిపిస్తుంది. ఏదేమయినా ఈ అలవాట్లు, వ్యసనాలూ ఎక్కణ్ణుంచి వచ్చినా, ఎలా వచ్చిన స్వైన్‌ఫ్లూ లాంటివి. ఒకరికి అంటితే మరెందరికో పాకుతుంది. సినిమావాళ్ళు, బడా వ్యాపారులే కాదు, కాలేజ్ పిల్లలు, ఆఖరికి కాన్వెంట్ పిల్లలు కూడా మత్తుకు అలవాటు పడుతున్నారంటే మనసు మెలిపెట్టినట్టు లేదూ?!

కాస్త వయసొచ్చినవాళ్ళు ఏదో ఫ్రస్ట్రేషన్ అంటూ సాకులు చెప్తారు. పిల్లలకలాంటివేం వుండవు కదా! అభంశుభం తెలీని పిల్లలు మత్తులో తూలుతున్నారంటే అంతకంటే దారుణం ఇంకేమైనా వుందా? ఇలా జరుగుతోందంటే వాళ్ళల్లో ఉన్న సహజమైన ఉత్సాహం, జిజ్ఞాస ట్రాక్ తప్పాయన్నమాట. ఆ తెలివిని గనుక మంచి విషయాలవైపు మళ్ళించగలిగితే చిన్నారుల్లో ఒక్కొకరూ న్యూటన్లూ, థెరిసాలు, టాగూర్లు అయిపోతారు. చదువును శిక్షలా కాకుండా ఆడుతూపాడుతూ బోధిస్తే వాళ్ళలో ఆసక్తి పెరుగుతుంది. చదువుతోబాటు ఆటపాటలు, క్రీడలకు బోల్డంత ప్రాధాన్యత ఇవ్వాలని మేధావులంతా చెప్పినా మనం దానికస్సలు ప్రాధాన్యత ఇవ్వడంలేదు.అలాగే కొన్ని స్కూళ్ళు, కాలేజీల్లో లిటరరీ క్లబ్, డ్రామా క్లబ్, ఫిలిం క్లబ్, కంప్యూటర్ క్లబ్, సైన్స్ క్లబ్ – అంటూ రకరకాల క్లబ్బులున్నాయి. వాటిల్లో ఆయా విభాగాల్లో అవసరమైన బాధ్యతలను నేర్పి, చిన్నతనంలో వాటిల్లో ఆసక్తి ఉన్నవారికి వారి వయసుకు తగినవిధంగా తర్ఫీదిస్తారు. ఎన్.సి.సి., బ్లూ క్రాస్ సొసైటీ లాంటి శిక్షణలూ ఉన్నాయి. చిన్నతనంలో పిల్లల ఆసక్తిని గమనించి అలాంటివాటిల్లో ఏదో ఒకదాంట్లో చేర్చితే గనుక వారి తెలివితేటలన్నీ అటువైపు మళ్ళుతాయి. మత్తులో జోగడం లాంటి భయంకరమైన అలవాట్లు చేసుకోకపోగా బాధ్యతాయుతంగా మెలగుతారు. చక్కటి క్రమశిక్షణా, వ్యక్తిత్వమూ అలవడ్తాయి. తాము బాగుండటమే కాదు, సమాజాన్నీ గొప్పగా మార్చగలుగుతారు. అంతేగా మరి, ఈ దీపాలు తాము వెలుగుతూ ఇంకెందరికో వెలుగులు పంచుతాయి.

# ఆరోగ్యానికి 5 సూత్రాలు




బావిలో నీళ్ళున్నంతవరకూ వాటి విలువ తెలీదు. అవి ఎప్పుడయితే అడుగంటుతాయో వాటి అవసరం ఎంత గొప్పదో తెలిసొస్తుంది. తిండి లేకుండానయినా కొన్నిరోజులు వుండొచ్చు కానీ నీళ్ళు లేకపోతే గంట కూడా గడవదు. ఆరోగ్యమూ అంతే.. శరీరంలో అన్ని భాగాలూ సవ్యంగా పనిచేస్తూ చలాకీగా ఉన్నంతవరకూ మన శారీరక భాగాలెంత అద్భుతమైనవో ఆలోచించం. అర్థం కాదు కూడా. కానీ, వాటిల్లో ఏ ఒక్కటి మొరాయించినా అప్పుడు తెలిసొస్తుంది. అందుకే 'ఆరోగ్యమే మహా భాగ్య'మని మన పూర్వీకులంటే 'హెల్తీజ్ వెల్త్' అని ఇంగ్లీష్‌వాళ్ళన్నారు. అదేం అనువాదం కాదు, యూనివర్సల్ థింకింగన్నమాట. 'ప్రివెన్షనీజ్ బెటర్ ద్యాన్ క్యూర్' అన్నట్టు అనారోగ్యం వచ్చాక బాధపడే బదులు ఏ జబ్బూ రాకుండా ముందే జాగ్రత్తపడితే అంతకంటే కావల్సిందేముంది?! ఎంచక్కా ఎప్పుడూ హాయిగా, ఆనందంగా వుండొచ్చు.

మరి ఆరోగ్యంగా వుండాలంటే ఏం చేయాలి? అదేం మార్కెట్లో దొరకదు, కొనుక్కోడానికి. ఏదైనా జబ్బు చేస్తే మందుబిళ్ళలు కొనుక్కుని వేసుకోవచ్చు లెమ్మనుకోవద్దు. వీలైనంతవరకూ ఔషధాలు మింగే అవసరం రాకుండానే వుండాలి. ఇదేం చోద్యమనో, చాదస్తమనో అనుకుని నవ్వుకుంటున్నారా? మనిషన్నాక రోగం, రొష్టు రాకుండా వుంటుందా.. ఏదో ఒక గోలీ వేసుకోక తప్పుతుందా అనిపిస్తోంది కదూ! అది సహజమే, దాన్నేం కాదనలేం. జలుబూ జ్వరాల్లాంటివి వస్తాయి, తప్పదు. కానీ, మరీ ఇబ్బంది పెట్టే పెద్ద సమస్యల సంగతి.. అలాంటివి మనిషిని కుంగతీస్తాయి. అందుకే అందుకు దూరంగా ఆరోగ్యంగా వుండేందుకు ప్రయత్నించాలి. అదేం అత్యాశో, అసాధ్యమో కాదు. మన ఆహారపు అలవాట్లూ, జీవనశైలి సవ్యంగా వుండేలా చూసుకుంటే మన ఆరోగ్యం మన చేతుల్లోనే వుంటుంది. అందుకు ముఖ్య సూత్రాలు కొన్ని –

- ఆకుకూరలు, బెండ, దొండ, దోసం, క్యాబేజ్, టొమేటో, గుమ్మడి, క్యారెట్, బొప్పాయి, యాపిల్, సపోటా, జామ, కమలా – ఇలా వివిధ రంగుల్లో వుండే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తప్పక తినడంవల్ల శరీరానికి అవసరమైన పోషకాలన్నీ అందుతాయి.
- ఆహారవేళలు తప్పకుండా పాటించాలి. ఎక్కువ మోతాదు ఒకేసారి తినేకంటే కొంతకొంత చొప్పున మూడునాలుగుసార్లు తినే అలవాటు మంచిది.
- పరగడపున రెండు గ్లాసుల నీళ్ళు తాగాలి. ఆనక రోజు మొత్తంలో రెండు లీటర్ల నీళ్ళు తాగాలి.
- నిత్యం అరగంట సేపయినా ధ్యానం చేయగలిగితే శారీరక, మానసిక అనారోగ్యాలు దరిచేరవు.కనీసం అరగంటకు తక్కువ కాకుండా రోజూ వ్యాయామం చేయాలి.
- రాత్రి పదిలోపు పడుకుని ఉదయం అయిదులోపు లేవడం ఆరోగ్యదాయకం.
- ఈ అయిదు నియమాలు పాటించగలిగితే అనారోగ్యానికి ఆమడదూరంలో వుంటామని నిపుణులు చెబుతున్నారు. పాటించి ఆనందంగా వుందామా!

## రాయపూడిలో తల్లిపాల వారోత్సవాలు



**రా.వా.ప్రతినిధి– తుళ్ళూరు :** రాయపూడి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలోని 6 అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలను జరుపుతున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.ఎస్ తబిత మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంట సమయంలో ముర్రు పాలు తాగించాలని చెప్పారు.తల్లిపాలు తాగిన బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలకు మించిన దివ్య ఔషదం లేదని, పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసారిగా అందించాలన్నారు. పౌష్టికాహారం తయారు చేసి గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు అందించారు .ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డుమెంబరు మాజీ శ్రీనివాసరావు అంగన్‌వాడీ కార్యకర్తలు చెరుకూరి సునీత ,షంషాద్ విజయకుమారి పాల్గొన్నారు.

## విశాఖ పోర్టు నుంచి నేపాల్‌కు సరుకు రవాణా

### 90 కంటెయినర్లతో బయలుదేరిన రైలు

**విశాఖపట్నం :** విశాఖపట్నం పోర్టు నుంచి నేపాల్‌కు తొలి కార్గో రైలు శుక్రవారం బయలుదేరింది. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత మెరుగుపరుచుకోవడానికి ఇది దోహదపడుతుందని విశాఖపట్నం పోర్టు చైర్మన్ కృష్ణబాబు పేర్కొన్నారు. తొలి రైలులో 90 కంటెయినర్లతో వివిధ రకాల సరకులను ఇక్కడి నుంచి ఎగుమతి చేశారు. ఇలా వారానికి కనీసం ఒక రైలునన్నా పంపిస్తామని, దశల వారీగా ఫ్రీక్వెన్సీ పెంచుతామని కృష్ణబాబు వివరించారు. ఇప్పటివరకు నేపాల్‌కు సరకు పంపాలన్నా, దిగుమతి చేసుకోవాలన్నా కోల్కతా పోర్టు ఒక్కటే దిక్కుగా ఉంది. నేపాల్‌లో తయారీ సంస్థలు లేకపోవడం వల్ల చైనా, కొరియాల నుంచి సరకు దిగుమతి చేసుకుని కోల్కతా పోర్టుకు చేర్చి అక్కడి నుంచి నేపాల్‌కు తీసుకుళతారు. నేపాల్‌కు అవసరమైన సరకులను తరలించడానికి భారత ప్రభుత్వం ఒక్క కోల్‌కతా పోర్టుకే అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో రెండో గేట్‌వేగా నిలిచేందుకు విశాఖపట్నం పోర్టు ముందుకు రావడంతో ప్రభుత్వం ఆ అవకాశం ఇచ్చిందని కృష్ణబాబు అన్నారు.

**విశాఖ పోర్టుతో లాభాలెన్నో...**

కోల్‌కతా పోర్టుకు ఏ నౌక రావాలన్నా సింగపూర్ వెళ్లి, అక్కడి నుంచి వేరే నౌకల ద్వారా సరకు కోల్‌కతాకు తరలించి అక్కడి నుంచి నేపాల్‌కు పంపాలి. బెర్తుల కొరత కారణంగా రెండు రోజులు సముద్రంలోనే వేచి ఉండాలి. ఆ తరువాత సరకు దించడానికి, ఎత్తడానికి అయ్యే సమయం కూడా పరిగణనలోకి తీసుకుంటే వ్యయాలు తడిసి మోపెడవుతున్నాయి. అదే విశాఖలో అయితే సముద్రం లోతు 16.5 మీటర్లు. డ్రెడ్జింగ్ చేయాల్సిన అవసరం లేదు. భారీ నౌకలు కేవలం గంట వ్యవధిలో బెర్తు దగ్గరకు వచ్చేస్తాయి. ఇప్పటికే చైనా, కొరియాల నుంచి కార్గో నౌకలు చాలా వస్తున్నాయి. ఇక్కడ ఆధునిక సాంకేతిక పరికరాలు వున్నందున టర్న్ ఎరౌండ్ టైమ్ చాలా తక్కువ. సరకులు వేగంగా దించి ఎగుమతి చేస్తారు. నౌకల అద్దె, ఇతర వ్యయాలు బాగా తగ్గుతాయి. కోలకతాలో ఈ ఛార్జీలు చాలా అధికం.

అయితే కోల్‌కతాతో పోల్చుకుంటే విశాఖ–నేపాల్ మధ్య దూరం ఎక్కువ అన్నది ఒక్కటే ప్రతికూలత.. కోల్‌కతా నుంచి 800 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే రైలు నేపాల్‌కు చేరుతుంది. అదే విశాఖ నుంచి అయితే 1,200 కిలోమీటర్లు ప్రయాణించాలి. అయితే ఇక్కడ లభించే ప్రయోజనాలతో పోల్చితే ఈ ప్రతికూలత అంత పెద్దది కాదని నేపాల్ సుదీర్ఘ పరిశీలన ద్వారా నిర్ణయానికి వచ్చింది. ఒకసారి సరకును రైలు ద్వారా ట్రయల్ రన్ తీసుకువెళ్లి పరిశీలించింది. కోల్‌కతా కంటే అనేక రెట్లు విశాఖపట్నం పోర్టే మెరుగుని నిర్ణయించుకోవడంతో విశాఖపట్నం పోర్టుకు సరకులు దిగుమతి చేసుకొని, ఇక్కడి నుంచి రైలు మార్గం ద్వారా నేపాల్ తీసుకెళ్లడానికి అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు తొలి రైలు శుక్రవారం బయలుదేరి వెళ్లింది. ఇది నాలుగు రోజుల్లో నేపాల్ చేరుతుంది. మొదటి రైలులో 90 కంటెయినర్ల ద్వారా సరకులను పంపించారు.

**రాజధాని వార్తలు వారి రక్షా బంధన్ శుభాకాంక్షలు**

# పాన్‌ను ఆధార్‌తో లింక్ చేశారా?




వార్షికాదాయం 2.50 లక్షల రూపాయలకన్నా అధికంగా ఉన్న వారు తమ ఆదాయ పన్ను రిటర్నులను సమర్పించాల్సి ఉంటుందన్న విషయం తెలిసిందే. అయితే వార్షికంగా రిటర్నులను సమర్పించే వారు తప్పకుండా తమ పాన్ (పర్మినెంట్ అకౌంట్ నెంబర్)ను ఆధార్ (12 అంకెలు)తో లింక్ చేయాలన్న నిబంధనను ఇప్పుడు తప్పనిసరి చేశారు. ఇలా లింక్ చేయకుంటే రిటర్నులను సమర్పించే అవకాశం ఉండదు. జూలై ఒకటో తేదీ నుంచి ఆధార్‌తో పాన్‌ను లింక్ చేయడం తప్పనిసరి చేస్తూ ఇటీవలే ఆదేశాలు వెలువడ్డాయి. ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియను చాలా సులభతరంగా నిర్వహించవచ్చు. ఆధార్‌తో పాన్‌ను లింక్ చేయాలనుకునే వారు https://www.incometaxindiaefiling.gov.in/ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. హోమ్ పేజీలోనే ఎడమవైపు భాగంలో 'లింక్ ఆధార్' అన్న లింక్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే ఒక విండో ఓపెన్ అవుతుంది. అందులో పాన్, ఆధార్ నెంబర్, ఆధార్‌పై ఉన్న పేరును ఎంటర్ చేసేందుకు బాక్స్‌లు ఉంటాయి. వీటిని ఎంటర్ చేశాక లింక్ ఆధార్ అన్న బటన్‌ను ప్రెస్ చేయగానే ఆధార్‌తో పాన్ లింక్ అవుతుంది. పాన్ కార్డుపై ఉన్న పేరుతో ఆధార్ పై ఉన్న పేరు మ్యాచ్ కాకపోతే ఆధార్ ఒటిపి ద్వారా లింక్ చేసే ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా ఆధార్‌తో పాన్‌ను లింక్ చేసే సదుపాయం కల్పించారు. ఇది ఎలాగంటే.. UIDPAN అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి 12 అంకెల ఆధార్ నెంబర్‌ను టైప్ చేసి స్పేస్ ఇచ్చి 10 ఆంగ్ల అక్షరాలు, అంకెలు కలిగిన పాన్ నెంబర్‌ను టైప్ చేసి 567678 లేదా 56161 నెంబర్లకు పంపించడం ద్వారా ఆధార్‌తోపాన్‌ను లింక్ చేయవచ్చు. ఇప్పటి వరకు దేశంలోని 115 కోట్ల మందికి ఆధార్‌ను కేటాయించగా.. 25 కోట్ల మంది పాన్ నెంబర్‌ను పొందారు. ఇప్పటి వరకు ఏడు కోట్ల మంది తమ పాన్‌ను ఆధార్‌తో లింక్ చేశారని అధికారవర్గాలు చెబుతున్నాయి. రానున్న కాలంలో ఈ సంఖ్య భారీ స్థాయిలో పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. బ్యాంకుల ద్వారా 50 వేల రూపాయలకు మించి లావాదేవీలు నిర్వహించే తరుణంలో పాన్ నెంబర్‌ను కోట్ చేయాల్సిన పరిస్థితి ఉన్నందు వల్ల ఎక్కువ మంది పాన్‌ను తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. కొత్తగా పాన్ తీసుకోవాలనుకునే వారికి కచ్చితంగా ఆధార్ ఉండాల్సిందేనన్న నిబంధనను కూడా విధించారు.

**మినహాయింపులు ఉన్నాయి...**

అయితే ఆధార్‌తో పాన్‌ను జత చేసే విషయంలో కొంత మందికి మినహాయింపు ఇచ్చారు. ఆదాయం పన్ను చట్టంలోని సెక్షన్ 139 ఎఎ కింద ఈ మినహాయింపులు లభిస్తున్నాయి.

- ఆదాయం పన్ను చట్టం ప్రకారం నాన్ రెసిడెంట్ ఇండియన్స్‌గా వర్గీకరించిన వారు
- భారత పౌరులు కాని వారు
- పన్ను చెల్లించే సంవత్సరంలో వ్యక్తి ఆదాయం 80 సంవత్సరాలు లేదా అంతకన్నా ఎక్కువ ఉన్న వారు
- అసోం, మేఘాలయా, జమ్మూకశ్మీర్ నివాసితులకు మినహాయింపులు లభిస్తున్నాయి.

## అన్నఅమృత హస్తం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు వంటపాత్రలు పంపిణీ



**రా.వా.ప్రతినిధి–తుళ్ళూరు :** రాయపూడిలో జరిగిన అన్నఅమృతహస్తం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుళ్ళూరు ఎంపిపి వడ్లమూడిపద్మలతపాల్గొన్నారు. గర్భిణీస్త్రీలకు,బాలింతలకు పౌష్టికాహారం పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు అవసరమైన వంటసామగ్రి ప్రభుత్వం అందజేస్తుందని 6అంగన్‌వాడీ కేంద్రాలకు 5వేలు చొప్పున రూ,30వేలు విలువగల వంట పాత్రలు కుర్చీలను పంపిణీచేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ రెంటపల్లి నాగమణెమ్మ మండల అధికారి జె.మోహన్‌రావు పంచాయతీ కార్యదర్శిగాదె వెంకటప్పయ్య వార్డుమెంబరు వల్లపర్ల సురేష్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెంట్ సాహెబ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు .


శ్రీ కల్కి అందరివారు
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి,
ఎం.బేగ్
లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు
3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహా
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ..

## అన్నా చెల్లెళ్ల అనుబంధం ..

# జన్మజన్మల సంబంధం



మతాలకు కులాలకు అతీతంగా ప్రజలంతా జరుపుకునే పండుగ రాఖీ పండుగ. 'రాఖీ, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. కొంతకాలం క్రితం వరకూ ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను ఇప్పుడు దేశమంతా జరుపుతున్నారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రధాన విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముల్లు జరుపుకునే అభిమానంగా జరుపుకునే పండుగ.



రక్షాబంధన్‌కు ప్రాతిపదిక ద్రౌపది –శ్రీకృష్ణుడు, అలెగ్జాండర్ – పురుషోత్తముడి భార్య,మహావిష్ణువు – బలిచక్రవర్తి

పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కరకాలం యుద్ధం సాగింది. యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు నిర్వీర్యుడై, తన పరివారమంతటినీ కూడగట్టుకొని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సాహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధనం చేస్తున్నాడని తెలుసుకొని భర్త దేవేంద్రుడికి సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్పిస్తుంది. సరిగ్గా ఆ రోజు రావణ పౌర్ణమి కావడంతో పార్వతీ పరమేశ్వరుల ను, లక్ష్మీనారాయణులను పూజించి రక్షా బంధన్‌ను దేవేంద్రుడి చేతికి కడుతుంది. అది గమనించిన దేవతలందరూ వారు పూజించిన రక్షలను తీసుకువచ్చి ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. శచీదేవి ప్రారంభించిన ఆ రక్షాబంధనం.. నేడు రాఖీ పండుగగా ఆచారమైందని పురాణాలు చెబుతున్నాయి.

ఇతిహాసాల ప్రకారం చూస్తే ద్రౌపది, శ్రీకృష్ణుడి కి అన్నాచెల్లెల అనుబంధం అత్యంత గొప్ప అనుబంధంగా కనిపిస్తుంది. శిశుపాలుడి ని శిక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణుని చూపుడు వేలుకు రక్తం ధారగా కారుతుందట. అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగు చింపి వేలికి కట్టు కట్టిందట. దానికి క ృతజ్ఞతగా ఎల్లవేళలా అండగా ఉంటానని శ్రీకృష్ణుడు ద్రౌపదికి హామీ ఇస్తాడు. అందుకు ప్రతిగా దుశ్శాసనుడి దురాగతం నుండి ఆమెను కాపాడుతాడు.

### మహావిష్ణువు – బలిచక్రవర్తి

శ్రీ మహావిష్ణువు బలి చక్రవర్తి కోరిక మేరకు అతనితోపాటు పాతాళంలో ఉండిపోతాడు. శ్రీమహాలక్ష్మి వెళ్లి బలిచక్రవర్తికి రక్షాబంధంకట్టి, తన భర్తను వైకుంఠానికి తీసుకొనిపోతుంది. అందుకే రక్షాబంధానికి ఇంత ప్రాధాన్యత ఏర్పడింది.


### అలెగ్జాండర్ భార్య, పురుషోత్తముడి కథ


గ్రీకు యువరాజు అలెగ్జాండర్ క్రీస్తు పూర్వం 326లో భారత దేశంపై దండెత్తుతాడు. గొప్పవైభవంతో తలతూగుతున్న భారత్‌ను జయించడం అలెగ్జాండర్ లక్ష్యంగా పెట్టుకుంటాడు. దీంతో పురుషోత్తముడి శత్రు రాజు అంబి, అలెగ్జాండర్‌ను భారతదేశంపై దండెత్తాలని ఆహ్వానిస్తాడు. పురుషోత్తముడు యుద్ధానికి సిద్ధమవుతాడు. యుద్ధం హోరాహోరీ జరుగుతుంది. అనుకున్నంత తేలిగ్గా జయించడం కుదరదని అలెగ్జాండర్ భావిస్తారు. అయితే పురుషోత్తముడి ధైర్యసాహసాలు అలెగ్జాండర్‌ను ఆకట్టుకుంటాయి. అదే సమయంలో రాఖీపూర్ణిమ సందర్భంగా పురుషోత్తముడి భార్య అలెగ్జాండర్‌కు రాఖీ కడుతుంది. అలెగ్జాండర్ ఆమెను చెల్లిగా భావించి యుద్ధాన్ని విరమింపచేస్తాడు.

### హయగ్రీవావతారం

శ్రీ మహావిష్ణువు విజయగాథా పరంపరలలో హయగ్రీవావతారంలో జరిగిన విజయం కూడా విశేషంగా చెబుతారు. పూర్వం ఓసారి హయగ్రీవుడు అనే ఓ రాక్షసుడు దేవిని గురించి తీవ్రంగా తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చిన దేవి వరం కోరుకొమ్మన్నప్పుడు తనకు మరణం లేకుండా చూడమన్నాడు. అయితే అది ఆమె సాధ్యపడదని చెప్పినప్పుడు హయగ్రీవం (గుర్రపు తల) ఉన్నవాడి చేతిలో మాత్రమే తనకు మరణం వచ్చేలా అనుగ్రహించమన్నాడు. ఆమె ఆ రాక్షసుడిని అనుగ్రహించి అంతర్ధానమైంది. ఆ వరంతో ఆ రాక్షసుడు దేవతలను ముప్పతిప్పలు పెడుతుండేవాడు. విష్ణుమూర్తి ఆ రాక్షసుడిని యుద్ధంలో నిరంతరం ఎదిరిస్తున్నా ఫలితం లేకపోయింది. చివరకు శివుడు ఓ ఉపాయాన్ని పన్నాడు. శ్రీ మహావిష్ణువు ధనుస్సుకు బాణాన్ని సంధించి ఉంచి విపరీతమైన అలసట కలిగి అగ్రభాగాన వాలి నిద్రపోయాడు. ఆయనను నిద్రలేపటానికి దేవతలెవరికీ ధైర్యం చాలలేదు. అయితే ఆ దేవతలంతా ఓ ఆలోచనకు వచ్చి వమ్రి అనే ఓ కీటకాన్ని పంపి ధనుస్సుకున్న అల్లెతాడును కొరకమని చెప్పారు. అలా చేస్తే తాడు వదులై విల్లు కదలి విష్ణువుకు మెలకువ వస్తుందన్నది వారి ఆలోచన. అయితే ఆ పురుగు తాడును కొరకగానే దేవతలు ఊహించని విధంగా వింటికి ఉన్న బాణం విష్ణువు మెడకు తగిలి ఆ దెబ్బకు విష్ణువు తల ఎటో ఎగిరి వెళ్ళింది. దేవతలు అంతటా వెదికారు కానీ ఆ తల కనిపించలేదు. బ్రహ్మదేవుడు వెంటనే దేవిని గురించి తపస్సు చేశాడు. అప్పుడామె ప్రత్యక్షమై ఒక గుర్రపు తలను తెచ్చి విష్ణుమూర్తి శరీరానికి అతికించమని చెప్పింది. దేవతలు అలాగే చేశారు. ఆ హయగ్రీవం అతికిన విష్ణుమూర్తిలో మళ్ళీ జీవం వచ్చి లేచాడు. ఆ లేచిన రోజే శ్రావణ పూర్ణిమ. ఆ తర్వాత హయగ్రీవుడుగా మారిన విష్ణుమూర్తి రాక్షసుడిని సులభంగా జయించాడు. దేవీ శక్తి మహిమను, శ్రీ మహావిష్ణు తత్వాన్ని ఈ కథ తెలియచెప్తుంది. అందుకే శ్రావణ పూర్ణిమ నాడు హయగ్రీవ జయంతి కూడా జరపడం కనిపిస్తుంది.

## జూనియర్ఎన్టీఆర్, రణబీర్‌కు కాగ్ నోటీసులు





నాన్నకు ప్రేమతో సినిమాకు కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) అక్షింతలు వేసింది. వినోద రంగంలో సేవా పన్నుల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై కాగ్ అధ్యయనం చేసి రూపొందించిన ఈ నివేదికను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కాగ్ నివేదికలో జూనియర్ ఎన్టీఆర్ కు సేవా పన్ను మినహాయింపుపై 'కాగ్' మండిపడింది. 'నాన్నకు ప్రేమతో' సినిమాను విదేశాల్లో షూట్ చేశాము కాబట్టి అది సేవల ఎగుమతి కిందికి వస్తుందని చూపిస్తూ ఎన్టీఆర్ పన్ను ఎగ్గొట్టారని కాగ్ నివేదికలో పేర్కొంది. 'నాన్నకు ప్రేమతో' సినిమాలో నటించినందుకు ఆయన లండన్‌కు చెందిన వైబ్రంట్ విజువల్ లిమిటెడ్ ప్రొడ్యూసింగ్ కంపెనీ నుంచి 7.33 కోట్ల రూపాయలను 2015లో పారితోషికంగా తీసుకున్నారని కాగ్ వెల్లడించింది. ఇందులో పన్నుగా చెల్లించాల్సిన 1.10 కోట్ల రూపాయలను ఎక్స్ పోర్ట్ ఆఫ్ సర్వీసుగా పరిగణించి పన్ను మినహాయింపునిచ్చారని కాగ్ తెలిపింది. దీనిపై వివరణ కోరగా జూనియర్ ఎన్టీఆర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వనున్నామని ఆర్థిక శాఖ అనుబంధ రెవెన్యూ విభాగం తెలిపింది. 'నాన్నకు ప్రేమతో' తరహాలోనే రణ్ బీర్ కపూర్, ఐశ్వర్యారాయ్, అనుష్క శర్మ నటించిన "ఏ దిల్ హై ముష్కిల్" సినిమా కూడా న్యూయార్క్ లో చిత్రీకరించామని చెబుతూ, రణ్ బీర్ 83.43 లక్షల రూపాయల పన్ను మినహాయింపు పొందాడని కాగ్ తెలిపింది. రణ్ బీర్ కు కూడా నోటీసులు జారీ చేయనున్నామని రెవెన్యూ విభాగం తెలిపింది.

## కాజల్ బిజీబిజీ



ఆమధ్య 'కాజల్ పనయిపోయింది.. అవకాశాలే లేవు' అంటూ కొందరు చప్పరించేశారు. కానీ అలాంటిదేం లేదని రుజువయింది. కాజల్‌కి ఇప్పుడు చేతినిండా పనితో యమా బిజీగా ఉంది. కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న 'ఎం.ఎల్.ఏ' చిత్రంలో కాజల్ అతనికి జోడీగా నటిస్తోంది. రానా సరసన నటించిన 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రం త్వరలో విడుదల కానుంది. కాజల్ నాయికగా మరో చిత్రం కూడా ప్రారంభం కానుంది. ఇంత బిజీగా వుండి కూడా గెస్ట్‌రోల్ చేయడానికి, స్పెషల్‌సాంగ్‌తో అలరించడానికీ కూడా కాజల్ నో చెప్పడం లేదు. పైగా వాటిమీద కూడా చాలా ఇంట్రస్ట్ చూపిస్తోంది. ఓంకార్ దర్శకత్వంలో నాగార్జున, సమంత జంటగా, సీరత్‌కపూర్ సెకెండ్ హీరోయిన్‌గా రూపొందిస్తున్న 'రాజుగారి గది 2' చిత్రంలో కాజల్ కీలకమైన పాత్ర చేజిక్కించుకున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఇక కాజల్ రాకతో ఆ అంచనాలు మరింత పెరిగాయి.

## చెవిలో పూలతో ముద్రగడ నిరసన

### పాదయాత్ర ప్రారంభం కాకుండా మూడోరోజూ అడ్డుకున్న పోలీసులు



**కిర్లంపూడి:** 'చలో అమరావతి' పాదయాత్రకు సిద్ధమైన కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను పోలీసులు శనివారం కూడా అడ్డుకున్నారు. దీంతో మండిపడ్డ ఉద్యమనేత.. 24 గంటల్లోగా ఉన్నతాధికారులతో మాట్లాడి పాదయాత్రకు అనుమతించాలని లేదంటే అరెస్టు చేయాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం సర్కారు తీరును నిరసిస్తూ ముద్రగడ సహా కాపు నేతలంతా చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. గడిచిన మూడు రోజులుగా ముద్రగడ పాదయాత్రకు బయలుదేరడం, అనుమతి లేదంటూ పోలీసులు ఆయనను ఇంటి గేటు వద్దే అడ్డుకోవడం జరుగుతోంది. ఐపీసీ సెక్షన్, 30, సెక్షన్ 144 అమలులో ఉన్నందున ర్యాలీకి అనుమతించబోమని పోలీసులు చెబుతుండగా, అంతే ఘాటుగా స్పందించిన ముద్రగడ.. పోలీసుల నోటీసులపై తాను కోర్టుకు వెళ్లనని, స్టేలు, బెయిల్ తెచ్చుకోబోనని తేల్చిచెప్పారు.

## అంజుమన్ ఇస్లామియా పాలకవర్గ నియమకం

**పాతగుంటూరు( పట్నంబజారు) :** గుంటూరులోని అంజుమన్ ఇస్లామియా నూతన పాలకవర్గాన్ని వక్ఫ్ బోర్డ్ నియమించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏపీ వక్ఫ్‌బోర్డు నూతన పాలక వర్గాన్ని నియమించటం హర్షనీయమని మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ జానీ అన్నారు. లాలా పేటలోని అంజుమన్‌సంస్థ నూతన పాలక వర్గం పదవీ బాధ్యతల స్వీకారోత్సవం జరిగింది. అంజుమన్ సంస్థ అధ్యక్షునిగా షేక్ ఖాజా మొయినుద్దీన్, కార్యదర్శిగా షేక్ రహంతుల్లా బేగ్, సభ్యులుగా షేక్ గపూర్, యూసఫ్, షేక్ మహ్మద్ ఎం.డి. ఇంతియాజ్, షేక్ ఖాజా,ఎం.డి.ఆల్తాఫ్,షేక్ ఖాదర్ బుడే,ఖలీలుల్లా నియమితులయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు షేక్ ఖాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ అంజుమన్ నిర్వహణలోని పాఠశాలను మరింత అభివృద్ధి చేసి, పేద మహిళలకు సహాయం చేస్తామన్నారు. షాదిఖానాల సంరక్షణకు ప్రాధాన్యత నిస్తామని వెల్లడించారు. మహమ్మద్ జానీ మాట్లాడుతూ అంజుమన్ సంస్థ అభివృద్ధికి అందరూ పాటు పడాలన్నారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.డి హిదాయత్ మాట్లాడుతూ మైనారిటీ సంస్థలను బలోపేతం చేసి ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం పలువురు ముస్లిం పెద్దలు నూతన పాలక వర్గ సభ్యుల్ని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



సీఎం చంద్రబాబుతో లాయర్ మోయినుద్దీన్ (ఫైల్)

Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.
D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at 6-45/1, Rayapudi, Guntur (DT), A.P. Editor: Pattan Hussain Khan,
Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18